## వైభవంగా శ్రీరాంపూర్ ఏరియా నూతన దుర్గాదేవి (మైసమ్మ) ఆలయ ప్రారంభోత్సవం




**మంచిర్యాల, 26, ఆగస్టు (ప్రజా జ్యోతి):** శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గాదేవి (మైసమ్మ) ఆలయ ప్రారంభోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. జీఎం కార్యాలయం, ఎస్ అండ్ పీసీ ఉద్యోగుల సహకారంతో కార్యాలయ ప్రాంగణంలో ఈ నూతన ఆలయాన్ని నిర్మించారు. సోమవారం నుంచి ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు





# ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

గురువారం 27 ఆగస్టు 2026 పేజీలు : 8


# ఐటీ టవర్ రెడీ

**ఆదిలాబాద్‌లో రూ 40 కోట్లతో నిర్మించిన టవర్ ప్రారంభానికి సిద్ధం**

**కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మూడెకరాల్లో నిర్మాణం**

**2 వేల మందికి ఉపాధి.. ప్రారంభించడంతో తీవ్ర జాప్యం**

**బీఆర్ఎస్ పాలనలో విస్తరించిన ఐటీ రంగం**

**ఆదిలాబాద్**

ఉమ్మడి రాష్ట్రంలో వెనకబడిన జిల్లాగా పేరుగాంచిన ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలో ఐటీ రంగాన్ని విస్తరించడానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి జోగు రామన్నలు ప్రత్యేకమైన చర్యలు తీసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీ రంగాన్ని విస్తరించడంతో హైదరాబాద్, బెంగళూరు, పుణె వంటి నగరాలకు పరిమితమైన ఐటీ కంపెనీలు ఆదిలాబాద్‌లో ఐటీ కంపెనీలు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వం కంపెనీల ఏర్పాటుకు అవసరమైన సాయం అందించారు. బీఆర్ఎస్ సర్కారు అందించిన సహకారంతో ఆదిలాబాద్‌లో ఐదేండ్ల కిందట ఐటీ కంపెనీ ప్రారంభం కాగా మూడేండ్ల కిందట మరో కంపెనీ ప్రారంభమైంది.

# కీలక ఖనిజాల వైపు సింగరేణి పరుగులు

**నైనీ స్ఫూర్తితో.. దేవదుర్గపై ఫోకస్**

**అన్ని ఖనిజ వేలాల్లో పాల్గొనాలి:**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**





# సామెల గ్రామపంచాయతీ లో పారిశుద్ధ కార్యక్రమం

## పరిశుభ్రతే ఆరోగ్యానికి తొలి మెట్టు
## సర్పంచ్ వాడై సంతోష్



**వాంకిడి ఆగస్టు 26 ప్రజా జ్యోతి** వాంకిడి మండల కేంద్రంలోని సామెల గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ సర్పంచ్ సంతోష్ ఆధ్వర్యంలో పరిశుద్ధ కార్యక్రమాన్ని నిర్వహించారు గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని చేపట్టారు గ్రామపంచాయతీ సిబ్బంది హెల్త్ వర్కర్లు స్థానికులు తదితరులు పాల్గొన్నారు గ్రామంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి మురుగు కాలువలు నీరు నిలిచే ప్రదేశాలు పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నిర్దేశిత ప్రాంతాల్లోనే వేయాలని ప్రజలకు సూచించారు ముఖ్యంగా నిల్వ ఉన్న నీటి కారణంగా దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్నందున నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ వర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించారు గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండటం వల్ల ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని సర్పంచ్ సంతోష్ తెలిపారు గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని ప్రజల సహకారంతో గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్యం కీలక పాత్ర పోషిస్తుందని ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు గ్రామంలో ఎక్కడైనా చెత్త మురుగు లేదా నీరు నిల్వ ఉండే పరిస్థితులు కనిపిస్తే గ్రామపంచాయతీ దృష్టికి తీసుకురావాలని సూచించారు పరిశుద్ధ కార్యక్రమంలో హెల్త్ వర్కర్లు చురుగ్గా పాల్గొని గ్రామస్తులకు ఆరోగ్య పారిశుద్ధ్యంపై పలు సూచనలు చేశారు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ చేపడుతున్న కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని గ్రామస్తులు తెలిపారు

# చెట్లను అమ్మా నాన్నలు.. తోబుట్టువులు.. ఆత్మీయ నేస్తాలుగా గౌరవించాలి

## చెట్టు మనిషికి రక్ష.. మనిషి చెట్టుకు రక్షగా ఉండాలి
## -- ప్రకృతి మిత్ర తెలంగాణ



**మంచిర్యాల, ఆగస్టు 26 (ప్రజాజ్యోతి):** రాఖీ పౌర్ణమిని పురస్కరిం చుకొని “మనిషికి చెట్టు రక్ష.. చెట్టుకు మనిషి రక్ష” అనే నినాదంతో ప్రకృతి మిత్ర తెలంగాణ ఆధ్వర్యంలో వృక్ష రక్షబంధన్ కార్యక్రమా న్ని బుధవారం మంచిర్యాల జన్మభూమి నగర్‌లోని ప్రాచీన రాముని చెరువు కట్టపై వైవిధ్యభరితంగా నిర్వహించారు. సంస్థ రాష్ట్ర వ్యవస్థాపకులు, తెలంగాణ ప్రభుత్వ వాల్టా పర్యావరణ చట్టం సెనేట్ సభ్యులు గుండేటి యోగేశ్వర్ ఆధ్వర్యంలో ప్రకృతి మిత్రులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రకృతి మిత్రులు పరస్పరం సహజ సిద్ధమైన పదార్థాలతో తయారు చేసిన రాఖీలను కట్టుకొని రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నా రు. అనంతరం అట్ట, కాగితం, ధాన్యపు గింజలు, ఆకులు, పూల రేకులు, డ్రై ఫ్రూట్స్ వ్యర్థాలు, దూదితో తయారు చేసిన ఆకర్షణీ యమైన పెద్ద సైజు రాఖీలను చెట్లకు ప్రేమగా కట్టి, వాటిని ఆలింగ నం చేసుకున్నారు. చెట్లకు కృతజ్ఞతలు తెలియజేస్తూ చెట్ల నీడలో సరదాగా గడిపారు. అనంతరం చెట్ల చుట్టూ మానవహారంగా ఏర్పడి “చెట్లే ప్రగతికి మెట్లు.. చెట్లు నరికితే ఇక్కట్లు.. వేయకు చెట్టుకు వేటు.. చేయకు భూమాతకు చేటు.. వనాలు ప్రకృతి ఇచ్చిన వరాలు.. కాపాడుతాయవి మనల్ని తరతరాలు.. పెరిగిన పచ్చదనం.. ఆరోగ్యానికి మూలధనం” అంటూ పెద్ద ఎత్తున నినా దాలు చేశారు. “చెట్టును ఆత్మీయ నేస్తంగా చేరదీయాలి.. అమ్మా నాన్నలుగా పూజించాలి” అంటూ సందేశాన్ని వినిపించారు. “సేవ్ ట్రీస్.. సేవ్ నేచర్” అంటూ నినాదాలు చేస్తూ ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గుండేటి యోగేశ్వర్, ఫారెస్ట్ రేంజ్ అధికారి రత్నాకర్ రావు, రెవెన్యూ అధికారి గడియారం శ్రీహరి, రాచకొండ చందన, రాధేశ్యాం మాట్లాడుతూ మానవులతో పాటు సకల జీవరాశికి ఆధారమైన చెట్లను ఆత్మీయ నేస్తాలుగా గౌరవించాలని అన్నారు. వివిధ కారణాలతో తొందరపాటు చర్యలకు పాల్పడి చెట్లను నరకవద్దని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, జాతీయ రహదారుల నిర్మా ణం తదితర అభివృద్ధి పనుల్లో వివిధ శాఖల అధికారులు సమన్వ యంతో ఆదర్శవంతమైన ప్రణాళికలు రూపొందించి వీలైనంత వరకు చెట్లను కాపాడాలని కోరారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఒక చెట్టును తొలగించాల్సి వస్తే దానికి బదులుగా కనీసం పది చెట్లు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. వనమహోత్సవాల్లో చెట్లు నాటడం ఎంత ముఖ్యమో, ఏపుగా పెరిగిన ఏళ్లనాటి చెట్లను, మహావృక్షాలను కాపాడుకోవడం అంతకన్నా ముఖ్యమని పేర్కొన్నా రు. చెట్టు మనిషికి రక్ష.. మనిషి చెట్టుకు రక్షగా మారాలని పిలుపు నిచ్చారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రజలు, యువత, మహిళలు ప్లాస్టిక్ రాఖీలకు బదులుగా సహజసిద్ధమైన పదార్థాలతో తయారు చేసిన రాఖీలను పరస్పరం కట్టుకోవాలని, అనంతరం అందుబా టులో ఉన్న చెట్లకు రాఖీలు కట్టి వాటి రక్షణకు ప్రతిజ్ఞ చేయాలని ప్రకృతి మిత్రులు కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ప్రకృతి మిత్రులు ప్రభాకర్, శరత్ చంద్ర, రాజశేఖర్, మధు, శ్యామ్, సునీత, లాస్యతో పాటు పలువురు ప్రకృతి మిత్రులు, జన్మభూమి నగర్ కాలనీ వాసులు, వాకర్స్ మిత్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# జేత్వాన్ బుద్ధ విహార్ లో మదర్ థెరిసా జయంతి వేడుకలు



**ఆసిఫాబాద్ , ఆగస్టు 26 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్ లో మంగళవారం సేవామూర్తి మదర్ థెరిసా 116వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు డాక్టర్ అశోక్ మహుల్కర్ మాట్లాడుతూ.. మదర్ థెరిసా తన జీవితమంతా మానవ సేవకే అంకితం చేశారని, మానవ సేవయే మాధవ సేవ అంటూ చివరి శ్వాస వరకు పేదలకు, అనాథలకు సేవ చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఐ జిల్లా అధ్యక్షులు దుర్గం శ్యామ్ రావు, సమాజ అధ్యక్షులు రాజేశ్వర్ ఉప్రే, శ్యామ్ రావు, లహుజీ దుర్గే, బౌద్ధ ఉపాసకులు ప్రకాష్ ఉప్రే, డొంగ్రే బిక్షపతి, మహుల్కర్ అరుణ్, జాడే మారుతి, ఇంద్రజిత్ ఉప్రే, భీంరావు, వెనకటి జాడే, తిరుపతి, సుదర్శన్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక



**జైపూర్: ఆగస్టు 26 ప్రజా జ్యోతి** జైపూర్ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. మండల ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ ఇరిగిరాల మల్లేష్ మాదిగ, నియోజకవర్గ ఇన్‌చార్జి సుందిళ్ల మల్లేష్ మాదిగ, మండల కో-ఇన్‌చార్జి తోకల మహేష్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం లో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుందిళ్ల చందు మాదిగ, ఉపాధ్యక్షుడిగా సుందిళ్ల గణేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా సదానంద మాదిగ, ప్రచార కార్యదర్శిగా లక్కీ మాదిగ, కార్యదర్శిగా బొల్లంపల్లి సమ్మయ్యను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా సుందిళ్ల శ్రీనివాస్ మాదిగ, సుందిళ్ల గట్టయ్య మాదిగ, తిరుపతి మాదిగ తదితరులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దళితుల హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని గ్రామస్థాయి లో మరింత బలోపేతం చేయాలని నూతన కమిటీకి సూచించారు గ్రామంలోని ఉద్యమకారులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి సంఘటిత ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా, ఆగస్టు 27న మధ్యాహ్నం 2 గంటలకు జైపూర్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీ ఎన్నిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి లింగం పల్లి సీనన్న మాదిగ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. మండలంలోని గ్రామ కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# భూ భారతి అప్పీల్‌పై వ్యత్యాసం..

- రిపోర్టులో తేదీ నుంచి సెక్షన్ వరకు ప్రశ్నలే ప్రశ్నలు
- 29.01.2026న అప్పీల్ దాఖలు.. రిపోర్టులో 2023 తేదీ ఎలా నమోదైంది?
- కోర్టుకు వెళ్లాలి' అన్న సూచనకు చట్టపరమైన ఆధారం ఏమిటి?
- భూ భారతి చట్టంలోని ఏ సెక్షన్ ప్రకారం నిర్ణయం తీసుకున్నారో చెప్పలేదని బాధితుడి ఆరోపణ
- పాత రెవెన్యూ రికార్డులు, ఎల్ఆర్‌యూపీ వివరాలు సమగ్రంగా పరిశీలించారా?
- అధికారిక పత్రాల్లో తేదీ తప్పిదంపై వివరణ ఇవ్వాలని డిమాండ్
- ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పూర్తి స్థాయిలో విచారించాలని విజ్ఞప్తి

**ఆసిఫాబాద్ ఆర్సీ, ఆగస్టు 26 (ప్రజాజ్యోతి):** భూమి.. రైతు కుటుంబానికి అత్యంత కీలకమైన ఆస్తి. భూమికి సంబంధించిన రికార్డుల్లో చిన్నపాటి తేడా వచ్చినా దాని ప్రభావం భవిష్యత్తులో తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. ఇలాంటి కీలకమైన భూ సమస్యపై భూ భారతి చట్టం కింద అప్పీల్ చేసుకున్న ఓ బాధితుడికి అందిన రిపోర్టు ఇప్పుడు పలు ప్రశ్నలకు తావిస్తోంది. రెబ్బెన మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన దుర్గం శ్రీనివాస్ తన భూ సమస్యపై ఆసిఫాబాద్ ఆర్డీఓ కార్యాలయం నుంచి వచ్చిన రిపోర్టులో స్పష్టత లోపించిందని ఆరోపిస్తూ, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వాస్తవాలను పరిశీలించాలని కోరుతున్నారు. తన భూ సమస్య పరిష్కారం కోసం నిబంధనల ప్రకారం మొదటి అప్పీల్ దాఖలు చేశానని శ్రీనివాస్ తెలిపారు. అయితే తనకు అందిన రిపోర్టులో దరఖాస్తు తేదీకి సంబంధించి వ్యత్యాసం కనిపించడంతో పాటు, ఏ చట్టంలోని ఏ సెక్షన్ ఆధారంగా నిర్ణయం తీసుకున్నారనే విషయం కూడా స్పష్టంగా లేదని పేర్కొన్నారు. అంతేకాకుండా కోర్టును ఆశ్రయించాలి అనే సూచనతో వ్యవహారాన్ని ముగించినట్లు కనిపిస్తోందని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

## 2017 ఎల్ఆర్‌యూపీ రికార్డుల నుంచే సమస్య

శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. 2017లో ఎల్ఆర్‌యూపీ ప్రక్రియలో రెబ్బెన తహసీల్దార్ కార్యాలయం ద్వారా పట్టా పాస్ పుస్తకాలకు సంబంధించిన నమోదు జరిగింది. ఆ ప్రక్రియకు సంబంధించిన భూ రికార్డుల విషయంలోనే తనకు సమస్య తలెత్తిందని తెలిపారు. భూమికి సంబంధించిన రికార్డుల్లో ఉన్న అంశాలను సరిచేసి తనకు న్యాయం చేయాలని గతంలో పలుమార్లు సంబంధిత అధికారులను సంప్రదించినట్లు చెప్పారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో చివరకు భూ భారతి చట్టం 2025ను ఆశ్రయించాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

## 29 జనవరి 2026న మొదటి అప్పీల్

తన భూ సమస్యపై భూ భారతి చట్టం 2025లోని సెక్షన్ 15 ప్రకారం 29.01.2026న ఆసిఫాబాద్ ఆర్డీఓకు మొదటి అప్పీల్ దాఖలు చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు. అప్పీల్‌లో తన భూమికి సంబంధించిన సమస్య, గత రికార్డుల వివరాలు, పట్టా పాస్ పుస్తకాల అంశాలు తదితర విషయాలను వివరించినట్లు చెప్పారు. సంబంధిత రికార్డులను పరిశీలించి, చట్టం ప్రకారం సమస్యను పరిష్కరిస్తారని ఆశించినట్లు పేర్కొన్నారు. కానీ కార్యాలయం నుంచి వచ్చిన రిపోర్టు తనకు స్పష్టమైన పరిష్కారాన్ని ఇవ్వలేదని, దాంతో సమస్య పరిష్కారం కాకుండా మరింత అయోమయానికి దారితీసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## అప్పీల్‌కు సమాధానం.. కానీ స్పష్టత ఎక్కడ?

తాను దాఖలు చేసిన అప్పీల్‌పై అధికారులు తీసుకున్న నిర్ణయం ఏంటో స్పష్టంగా తెలియాలని శ్రీనివాస్ కోరారు. అప్పీల్ పరిశీలనలో భాగంగా ఏ రికార్డులను పరిశీలించారు? సంబంధిత అధికారుల నుంచి ఏ సమాచారం తీసుకున్నారు? పాత రికార్డులు, ప్రస్తుత రికార్డులను పోల్చారా? తన వాదనను పరిగణనలోకి తీసుకున్నారా? అనే అంశాలపై స్పష్టత అవసరమని పేర్కొన్నారు. కేవలం తుది సూచన ఇవ్వడం కంటే నిర్ణయం తీసుకునే ముందు, తర్వాత జరిగిన ప్రక్రియను కూడా రికార్డులో స్పష్టంగా ఉంచితే బాధితుడికి న్యాయపరమైన మార్గం అర్థమవుతుందని అన్నారు.

## కోర్టుకు వెళ్లాలి.. ఎందుకు?

తనకు అందిన రిపోర్టులో కోర్టును ఆశ్రయించాలనే సూచన ఉందని శ్రీనివాస్ తెలిపారు. అయితే తాను భూ భారతి చట్టం కింద మొదటి అప్పీల్ దాఖలు చేసినప్పుడు, తన అప్పీల్ పరిధిలోని అంశంపై అధికారులు ఏ నిర్ణయం తీసుకున్నారో ముందుగా స్పష్టంగా తెలియజేయాలని కోరారు. కోర్టుకు వెళ్లాలి అని చెప్పడానికి గల చట్టపరమైన కారణం ఏమిటి? ఏ అంశంపై కోర్టును ఆశ్రయించాలి? అప్పీల్ పరిధిలో ఆ అంశాన్ని పరిష్కరించే అవకాశం ఎందుకు లేదని భావించారు? వంటి ప్రశ్నలకు సమాధానం కావాలని ఆయన డిమాండ్ చేశారు.

## రిపోర్టులో 2023 తేదీ.. తీవ్ర అభ్యంతరం

ఈ మొత్తం వ్యవహారంలో తనకు అత్యంత ఆశ్చర్యం కలిగించిన అంశం రిపోర్టులోని తేదీ అని శ్రీనివాస్ తెలిపారు. తాను 29.01.2026న అప్పీల్ దాఖలు చేయగా, సంబంధిత రిపోర్టులో 2023 సంవత్సరానికి చెందిన తేదీ నమోదై ఉందని పేర్కొన్నారు. నేను 2026లో అప్పీల్ దాఖలు చేశాను. అలాంటప్పుడు దానికి సంబంధించిన రిపోర్టులో 2023 తేదీ ఎలా వచ్చింది? అని ఆయన ప్రశ్నించారు. ఇది సాధారణ టైపింగ్ తప్పిదమైతే దానిని సరిచేసి అధికారికంగా స్పష్టత ఇవ్వాలని కోరారు. పాత రికార్డు నుంచి వివరాలు తీసుకున్నా, వాటిని ధృవీకరించి మాత్రమే రిపోర్టులో నమోదు చేయాల్సి ఉంటుందని అన్నారు.

## భూ రికార్డుల్లో తేదీకి ఎందుకంత ప్రాధాన్యం?


భూమికి సంబంధించిన వివాదాల్లో దరఖాస్తు తేదీ, రిజిస్ట్రేషన్ తేదీ, పట్టా తేదీ, మార్పిడి తేదీ, అప్పీల్ తేదీ వంటి వివరాలు కీలకమని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఒక తేదీ తప్పుగా నమోదైతే దాని ఆధారంగా తదుపరి ప్రక్రియలో కూడా తప్పుదోవ పట్టే అవకాశం ఉందన్నారు. అందువల్ల రిపోర్టులోని తేదీని సంబంధిత రికార్డులతో సరిపోల్చి, వాస్తవ తేదీ ఏదో అధికారులు నిర్ధారించాలని కోరారు.

## ఏ సెక్షన్ కింద నిర్ణయం?

భూ భారతి చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం తాను మొదటి అప్పీల్ దాఖలు చేసినప్పటికీ, తనకు అందిన రిపోర్టులో అప్పీల్‌పై ఏ సెక్షన్ ప్రకారం నిర్ణయం తీసుకున్నారో స్పష్టత లేదని శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక చట్టం కింద దాఖలైన అప్పీల్‌పై నిర్ణయం తీసుకునేటప్పుడు సంబంధిత చట్టం, వర్తించే సెక్షన్, నిర్ణయానికి కారణాలు స్పష్టంగా ఉండాలని ఆయన కోరారు. తన అప్పీల్‌ను పరిశీలించిన అధికారులు ఏ నిబంధనను ఆధారంగా తీసుకున్నారో తెలుసుకునే హక్కు తనకు ఉందని పేర్కొన్నారు.

## రికార్డులు పూర్తిగా పరిశీలించారా?

2017లోని ఎల్ఆర్‌యూపీ రికార్డుల నుంచి ప్రస్తుత భూ రికార్డుల వరకు అన్నింటినీ సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని శ్రీనివాస్ అన్నారు. పాత రికార్డులు, పట్టా పాస్ పుస్తకాల వివరాలు, సంబంధిత రెవెన్యూ రికార్డులు, అప్పీల్‌కు జత చేసిన పత్రాలు అన్నింటినీ ఒకదానితో ఒకటి పోల్చి చూడాలని కోరారు. రికార్డుల్లో తేడా ఉంటే దాని మూల కారణాన్ని గుర్తించాల్సి ఉంటుందని, ఒక రికార్డును ఆధారంగా చేసుకుని మాత్రమే నిర్ణయం తీసుకోవడం వల్ల సమస్య పరిష్కారం కాకపోవచ్చని పేర్కొన్నారు. బాధితుడి వాదనను పూర్తిగా వినాలని డిమాండ్ తన వాదనను పూర్తిగా వినకుండా లేదా సంబంధిత పత్రాలను పరిశీలించకుండా నిర్ణయం తీసుకోకూడదని శ్రీనివాస్ కోరారు. తనకు అవసరమైన పత్రాలు సమర్పించేందుకు అవకాశం కల్పించాలని, తన అభ్యంతరాలను రికార్డులో నమోదు చేయాలని, ఆ తర్వాత చట్టం ప్రకారం తుది నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లీగల్ సర్వీసెస్ విషయంలోనూ స్పష్టత భూ సమస్యపై న్యాయ సహాయం అవసరమైతే లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా అందుబాటులో ఉన్న మార్గాలను అధికారులు తెలియజేయాలని శ్రీనివాస్ కోరారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కోర్టు ప్రక్రియ,





న్యాయ సహాయం, అప్పీల్ విధానం వంటి విషయాలపై పూర్తి అవగాహన ఉండకపోవచ్చని, అందువల్ల అధికారులు బాధితుడికి సరైన మార్గదర్శకత్వం ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు.

## కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వద్దు

భూ సమస్య పరిష్కారం కోసం నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి సామాన్యులకు ఇబ్బందికరమని శ్రీనివాస్ అన్నారు. ఒక దరఖాస్తు ఇచ్చిన తర్వాత దాని స్థితి ఏమిటి, ఎక్కడ పెండింగ్‌లో ఉంది, ఎవరు పరిశీలించారు, ఏ నిర్ణయం తీసుకున్నారు వంటి అంశాలపై పారదర్శకత ఉండాలని కోరారు. ఆర్టీఐ వ్యవహారంపైనా ఆరోపణ తన భూ సమస్యతో పాటు గతంలో ఆర్టీఐ ద్వారా సమాచారం కోరిన సందర్భంలో కూడా ఆర్డీఓ కార్యాలయం నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని శ్రీనివాస్ ఆరోపించారు. ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని నిబంధనల ప్రకారం అందించాలని, అధికారిక రికార్డుల విషయంలో పారదర్శకత పాటించాలని ఆయన కోరారు.

## ఉన్నతాధికారులు రికార్డులను పరిశీలించాలి

తనకు అందిన రిపోర్టును ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించాలని శ్రీనివాస్ కోరుతున్నారు. అసలు అప్పీల్ దరఖాస్తు, దాని స్వీకరణ తేదీ, రిపోర్టులోని తేదీ, సంబంధిత రెవెన్యూ రికార్డులు, పట్టా పాస్ పుస్తకాల వివరాలు, ఎల్ఆర్‌యూపీ రికార్డులు తదితర అంశాలను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. తేదీ తప్పిదం ఉన్నట్లయితే సరిచేసి, వర్తించే సెక్షన్లను స్పష్టంగా పేర్కొంటూ తాజా నివేదిక లేదా ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## అధికారుల వివరణపై ఆసక్తి

బాధితుడు లేవనెత్తుతున్న ప్రశ్నలకు సంబంధిత అధికారులు ఏ విధంగా సమాధానం ఇస్తారన్నది ఇప్పుడు కీలకంగా మారింది. 2026లో దాఖలైన అప్పీల్‌కు సంబంధించిన రిపోర్టులో 2023 తేదీ ఎందుకు నమోదైంది?అప్పీల్‌పై ఏ సెక్షన్ కింద చర్యలు తీసుకున్నారు? 'కోర్టుకు వెళ్లాలి' అనే సూచనకు చట్టపరమైన ఆధారం ఏమిటి? సంబంధిత భూ రికార్డులను పూర్తిగా పరిశీలించారా? వంటి అంశాలపై అధికారుల వివరణ రావాల్సి ఉంది.


## రిపోర్టు స్పష్టంగా ఉండాలి.. న్యాయం జరగాలి

తన పోరాటం వ్యక్తిగత ప్రయోజనం కోసం మాత్రమే కాదని, భూ రికార్డుల విషయంలో సామాన్య ప్రజలకు స్పష్టమైన విధానం ఉండాలనే ఉద్దేశంతోనే ప్రశ్నిస్తున్నానని శ్రీనివాస్ పేర్కొన్నారు. అధికారిక పత్రాల్లో తప్పులు ఉంటే వాటిని సరిచేయాలని, చట్టపరమైన అంశాలను స్పష్టంగా పేర్కొనాలని, బాధితుడికి తదుపరి మార్గాన్ని తెలియజేయాలని కోరారు. తన భూ సమస్యను మరోసారి సమగ్రంగా పరిశీలించి, అందుబాటులో ఉన్న అన్ని రికార్డులను పరిశీలించిన అనంతరం భూ భారతి చట్టం ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధితుడి ఆరోపణలు, అభ్యంతరాలపై సంబంధిత రెవెన్యూ అధికారులు అధికారికంగా స్పందించిన అనంతరం ఈ వ్యవహారంలో వాస్తవ పరిస్థితిపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# వైభవంగా శ్రీరాంపూర్ ఏరియా నూతన దుర్గాదేవి (మైసమ్మ) ఆలయ ప్రారంభోత్సవం

## మూడు నెలల్లోనే ఆలయ నిర్మాణం పూర్తి జీఎం మునిగంటి శ్రీనివాస్





**మంచిర్యాల, 26, ఆగస్టు (ప్రజా జ్యోతి):** శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గాదేవి (మైసమ్మ) ఆలయ ప్రారంభోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. జీఎం కార్యాలయం, ఎస్ అండ్ పీసీ ఉద్యోగుల సహకారంతో కార్యాలయ ప్రాంగణంలో ఈ నూతన ఆలయాన్ని నిర్మించారు. సోమవారం నుంచి ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమ, మంగళవారాల్లో ఆలయ ప్రారంభోత్సవం విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించి వివిధ హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేదపండితుల సమక్షంలో అత్యంత నిష్ఠతో నిర్వహించారు. ఉత్పత్తి నిలిపివేసిన ఆర్కే-6 గని ఆలయంలోని అమ్మవారి విగ్రహాన్ని జీఎం కార్యాలయంలో ప్రతిష్ఠించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా జీర్ణోద్ధారణ క్రతువు నిర్వహించి ఆర్కే-6 ఆలయంలోని అమ్మవారి విగ్రహాన్ని జీఎం కార్యాలయానికి తరలించారు. అనంతరం మూడు రోజుల పాటు అమ్మవారి మూర్తికి వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజైన బుధవారం నిర్ణయించిన ముహూర్తానికి గర్భగుడిలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. జీఎం దంపతులు మునిగంటి శ్రీనివాస్, ఉమారాణితో పాటు ఎస్ఓటూ జీఎం కృష్ణప్రసాద్, రిటైర్డ్ ఎస్ఓటూజీఎం ఎన్.సత్యనారాయణ, ఐకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ.వీ.రెడ్డి, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి, ఎస్ అండ్ పీసీ గార్డు మల్లికార్జున్ దంపతుల ఆధ్వర్యంలో హోమాలు, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు నిర్ణయించిన ముహూర్తానికి అమ్మవారి విగ్రహాన్ని గర్భగుడిలో ప్రతిష్ఠించి ప్రాణప్రతిష్ఠ చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ సంకల్ప బలం ఉంటే ఎంతటి పనినైనా సులభంగా ముందుకు తీసుకెళ్లవచ్చని, అందుకు నూతన ఆలయ నిర్మాణమే ఉదాహరణ అన్నారు. ఆలయ నిర్మాణానికి సంకల్పించిన మూడు నెలల్లోనే ఎలాంటి విఘ్నాలు, ఆటంకాలు లేకుండా నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించుకోవడం రికార్డు అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో సింగరేణిలోనే శ్రీరాంపూర్ ఏరియాకు ఉత్పత్తి, భద్రతలో మంచి పేరుతో పాటు ప్రతి ఒక్కరినీ అమ్మవారు చల్లగా చూడాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణ కార్యక్రమంలో భాగస్వాములైన జీఎం కార్యాలయం, ఎస్ అండ్ పీసీ సిబ్బందితో పాటు విరాళాల రూపంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ జీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ నిర్మాణం, ప్రారంభోత్సవ కార్యక్రమాలను చక్కగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జీఎం కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని అన్ని గనులు, విభాగాల అధికారులు, ఉద్యోగులు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, స్థానికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రాఖీ వేళ ఆర్టీసీ బాదుడు!

**'స్పెషల్' పేరుతో రూ.200 అదనపు చార్జీ!**

**పండుగ రద్దీని ఆసరాగా చేసుకుని ప్రయాణికుల జేబులకు చిల్లు!**

**ఆసిఫాబాద్ ఆగస్టు 26 ప్రజా జ్యోతి** రాఖీ పౌర్ణమి పండుగ వేళ సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులపై ఆర్టీసీ అదనపు చార్జీల భారం మోపుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకుని సాధారణ ఎక్స్‌ప్రెస్ సర్వీసుల తరహాలోనే ఉన్న బస్సులకు 'స్పెషల్' పేరుతో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. బస్సులో ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలు కల్పించకుండానే అదనపు రుసుము వసూలు చేయడంపై మండిపడుతున్నారు.

**సాధారణ బస్సుకే రూ.200 అదనపు భారం**

సికింద్రాబాద్ జేబీఎస్ నుంచి ఆసిఫాబాద్‌కు బుధవారం సాయంత్రం 6.08 గంటలకు బయలుదేరిన బస్సులో ప్రయాణించిన ఆసిఫాబాద్‌కు చెందిన చాపిడి సురేష్‌కు అదనపు చార్జీల అనుభవం ఎదురైంది. టికెట్‌పై ఆసిఫాబాద్ డిపో, జేబీఎస్-ఆసిఫాబాద్ సర్వీస్ వివరాలు నమోదై ఉండగా, మొత్తం రూ.700 చార్జీ వసూలు చేసినట్లు టికెట్‌లో ఉంది. సాధారణ చార్జీతో పోలిస్తే సుమారు రూ.200 అదనంగా వసూలు చేశారని సురేష్ తెలిపారు. కండక్టర్‌ను అదనపు చార్జీలపై ప్రశ్నించగా.. పై అధికారుల ఆదేశాల మేరకే 'స్పెషల్' చార్జీలు వసూలు చేస్తున్నట్లు చెప్పారని బాధిత ప్రయాణికుడు పేర్కొన్నారు.

**పండుగ రద్దీని ఆసరాగా చేసుకుని..**

రాఖీ పండుగ సందర్భంగా వేలాది మంది ప్రజలు సొంతూళ్లకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులపై ఆధారపడుతున్నారు. ఈ రద్దీని ఆసరాగా చేసుకుని సాధారణ సర్వీసులకు 'స్పెషల్' బోర్డులు




ఏర్పాటు చేసి అదనపు వసూళ్లకు పాల్పడటం సరికాదని ప్రయాణికులు అంటున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలపై పండుగ వేళ అదనపు భారం మోపడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

**ఆర్టీసీ స్పష్టత ఇవ్వాలి**

స్పెషల్ సర్వీసుల పేరుతో ఎంత అదనపు చార్జీ వసూలు చేయాలనే విషయంపై ప్రయాణికులకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని వారు కోరుతున్నారు. అదనపు చార్జీలపై తెలంగాణ ఆర్టీసీ యాజమాన్యం స్పందించి, నిబంధనలను వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. "పండుగ పూట అక్కాచెల్లెళ్ల వద్దకు వెళ్లే ప్రయాణికుల నుంచి ఇలా అదనపు చార్జీలు వసూలు చేయడం బాధాకరం. పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపకుండా ఆర్టీసీ యాజమాన్యం స్పందించాలి."

చాపిడి సురేష్, బాధిత ప్రయాణికుడు, ఆసిఫాబాద్'

# జైపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ




**జైపూర్: ఆగస్టు 26 ప్రజా జ్యోతి** జైపూర్ పోలీస్ స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ మంగళవారం వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, సీజ్ చేసిన వాహనాలు, రికార్డులు, పెండింగ్ కేసుల ఫైళ్లను తనిఖీ చేసి దర్యాప్తు పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీసులు అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతలను కాపాడాలని, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీసీపీ సూచించారు. గ్రామాల్లో నిఘా పెంచడంతో పాటు రాత్రివేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని ఆదేశించారు. రహదారి భద్రత, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగంపై అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో కలిసి డీసీపీ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ నవీన్, ఎస్ఐ భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రేపటి గ్రామ సభను ఓటర్లు సద్వినియోగం చేసుకోండి

**-బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుడాల అనీష్**



**సోనాల, ఆగస్టు 26 ( ప్రజాజ్యోతి ):** ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా సోనాల మండలం లోని 223 బూత్ లో వచ్చిన నోటీసులను పరిశీలించి కొన్ని సవరణలు చేసి కావాల్సిన పత్రాలను రేపు జరగబోయే గ్రామ సభలో తీసుకొని రావాలని ఓటర్లకు విజ్ఞప్తి చేయడం జరిగింది. యువజన నాయకుడు గుడాల అనీష్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 27 న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే గ్రామ సభలు కీలకమని ఈ సభలో ఓటర్ల ముసాయిదా జాబితాలను బీఎల్ఓ లు చదివి వినిపిస్తారని తెలియచేసారు. తొలగించిన ఏఎస్ డిడి (ఆచూకీ దొరకనివి,వలస వెళ్లిన,మృతి చెందిన, డూప్లికేట్) ఓటర్ల వివరాలను క్లుప్తంగా వెల్లడిస్తారని తెలిపారు. ఎలక్షన్ కమిషన్ ఇటీవల విడుదల చేసిన ముసాయిదా జాబితాల ప్రకారం రాష్ట్రం లో మొత్తం 3.38 కోట్ల ఓటర్లలో ఏఎస్ డి డి కింద 73.39 లక్షల పేర్లను తొలగించారని,మిగిలిన 2.64 కోట్ల ఓటర్లలో అనామలిస్ మరియు అన్ మ్యాపింగ్ కింద 92.87 లక్షల మంది ఓటర్లకు ఎన్నికల సంఘం మరియు అధికారులు నోటీసులు ఇచ్చిందన్నారు .కావున కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ లు అర్హత ఉన్న ప్రతి ఓటరు పేరును తుది జాబితాలో ఉండేలా ప్రతి ఓటును కాపాడేలా కృషి చెయ్యాలని అన్నారు .సోనాల మండలం లో 2846 నోటీసులు వచ్చాయని ప్రతి గ్రామం లోని వార్డు సభలో ఫారం 6, 7, 8, లను అందుబాటులో ఉంచుతారని ఎవరైనా కొత్త ఓటరుగా నమోదయ్యేందుకు,ముసాయిదా జాబితాలోని పేర్లు మరియు చిరునామాలు వంటి వాటిలో తప్పులు,అక్షర దోషాలుంటే మార్పులు చేర్పులకు వీటిని ఉపయోగించుకోవాలని అక్కడికక్కడే అవసరమైన ఫారాలను నింపి తగిన ఆధారాలతో బీఎల్ ఓ లకు అందచేయాలని సూచించారు.

# అభివృద్ధి పనులకు ప్రాధాన్యం.. అందరి సహకారంతో ముందుకు:సర్పంచ్ బాపూజీ

**ఆసిఫాబాద్ ఆర్సీ,ఆగస్టు 26 (ప్రజాజ్యోతి):**గ్రామానికి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత పదవిని హోదాగా కాకుండా ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావిస్తూ ముందుకు సాగుతున్న నాయకత్వం గ్రామంలో ప్రత్యేక చర్చకు దారితీస్తోంది. గ్రామ ప్రజల అవసరాలను తెలుసుకోవడం, స్థానికంగా నెలకొన్న సమస్యలను గుర్తించడం, వాటి పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేయడం వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. సర్పంచ్ అంటే కేవలం గ్రామపంచాయతీ కార్యాలయంలో కూర్చొని పరిపాలన సాగించే వ్యక్తి కాదని.. ప్రజల మధ్యకు వెళ్లి వారి ఇబ్బందులను తెలుసుకుని పరిష్కారానికి మార్గం చూపాల్సిన బాధ్యత కలిగిన ప్రజాప్రతినిధి అన్న భావనతో వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీ సర్పంచ్ మోహర్లే బాపూజీ పనిచేస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ ఆలోచనతోనే గ్రామంలోని వివిధ ప్రాంతాలను సందర్శిస్తూ అక్కడి పరిస్థితులను తెలుసుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నారని అంటున్నారు.

### ప్రతి సమస్యపై ప్రత్యేక దృష్టి

గ్రామంలో రహదారులు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, మురుగు కాలువలు, ప్రజా వసతులు వంటి అనేక అంశాలపై ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని సర్పంచ్ గుర్తిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఏ సమస్య వచ్చినా దానిని నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొంటున్నారు. గ్రామంలోని ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్న తీరు ప్రజల్లో సానుకూల అభిప్రాయాన్ని కలిగిస్తోందని అంటున్నారు.

### ప్రజలతో నేరుగా మమేకం

గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని భావిస్తూ ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడంపై సర్పంచ్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలుస్తోంది. తమ సమస్యలను చెప్పేందుకు వచ్చిన గ్రామస్థులతో మాట్లాడటం, వారి ఇబ్బందులను తెలుసుకోవడం, సాధ్యమైన పరిష్కార మార్గాలను సూచించడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రజలతో దూరంగా ఉండే నాయకత్వం కంటే ప్రజల మధ్య ఉండే నాయకత్వమే గ్రామానికి ఉపయోగకరమని భావిస్తూ ముందుకు సాగుతున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. గ్రామంలోని పెద్దలు, మహిళలు, యువత, రైతులు, కార్మికులు, పేద కుటుంబాలు ఇలా అన్ని వర్గాల సమస్యలను సమానంగా పరిగణనలోకి తీసుకోవాలనే ఆలోచనతో పనిచేస్తున్నారని అంటున్నారు.



### అభివృద్ధి పనుల్లో వేగం.. నాణ్యతపై దృష్టి

గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులు కేవలం ప్రారంభోత్సవాలకే పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా పూర్తి కావాలన్నదే సర్పంచ్ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోందని గ్రామస్థులు పేర్కొంటు న్నారు. రోడ్లు, కాలువలు, పారిశుద్ధ్య పనులు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులపై దృష్టి సారిస్తూ గ్రామానికి అవసరమైన పనులను గుర్తించి దశలవారీగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలిస్తూ అవసరమైన చోట సంబంధిత సిబ్బందికి సూచనలు చేయడం ద్వారా పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలనే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు. గ్రామ భవిష్యత్‌పై ప్రత్యేక ప్రణాళిక ప్రస్తుత సమస్యల ను పరిష్కరించడమే కాకుండా రాబోయే రోజుల్లో గ్రామానికి అవసరమయ్యే మౌలిక వసతులపై కూడా ముందుగానే దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని సర్పంచ్ భావిస్తున్నారని సమాచారం. గ్రామాన్ని మరింత పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు అవసరమైన వసతులను మెరుగుపరచేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. గ్రామంలో ప్రతి అభివృద్ధి పని వెనుక ప్రజల అవసరం ఉండాలే తప్ప వ్యక్తిగత ప్రయోజనాలు ఉండకూ డదనే విధంగా పాలన సాగించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలాంటి విధానంతో ముందుకు సాగితే గ్రామానికి మరింత ప్రయోజనం చేకూరుతుందని అంటున్నారు.

### అందరి సహకారంతోనే అభివృద్ధి

గ్రామాభివృద్ధి ఒక్క సర్పంచ్‌తోనే సాధ్యం కాదని.. వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని సర్పంచ్ భావిస్తున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అందుకే రాజకీయాల కు అతీతంగా గ్రామ సమస్యలను పరిష్కరించేందుకు అందరినీ కలుపుకుని వెళ్లే ప్రయత్నం అవసరమని పలువురు సూచిస్తున్నారు. గ్రామంలోని భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి అభివృద్ధి విషయంలో ఏకాభిప్రాయంతో ముందుకు సాగితే గ్రామానికి మరిన్ని నిధులు, మరిన్ని అభివృద్ధి అవకాశాలు లభించే అవకాశం ఉంటుందని వారు చెబుతున్నారు. నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే అసలు పరీక్ష ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామానికి గుర్తుండిపోయే అభివృద్ధి చేయడం సర్పంచ్‌కు ముందున్న ప్రధాన బాధ్యత. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, పరిష్కా రానికి చొరవ చూపుతూ, అభివృద్ధి పనుల్లో పారదర్శకతకు ప్రాధా న్యం ఇస్తే ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని స్థానికులు అభిప్రాయపడుతు న్నారు. పదవి ఉన్నంతకాలం ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ, గ్రామానికి అవసరమైన పనులను గుర్తించి వాటి కోసం కృషి చేయడమే నిజమైన ప్రజాసేవ అని పలువురు పేర్కొంటున్నారు.

### గ్రామ ప్రగతే లక్ష్యంగా..

ప్రజల సమస్యలపై స్పందన.. అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి.. అధికారులతో సమన్వయం.. గ్రామస్థులతో నిరంతర సంప్రదింపులు భవిష్యత్ అవసరాలపై ప్రణాళిక.. ఇవన్నీ కలగలిపి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలనే ప్రయత్నం కొనసాగుతోందని స్థానికంగా చర్చ జరుగుతోంది. ప్రజల విశ్వాసాన్ని బలంగా చేసుకుంటూ.. గ్రామ అవసరాలను అర్థం చేసుకుంటూ.. అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగుతున్న సర్పంచ్ నాయకత్వం రానున్న రోజుల్లో గ్రామానికి మరింత మేలు చేకూర్చాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

## రోస్టర్ సవరణ కోసం గళమెత్తిన మాల మహానాడు

**ఆగస్టు 31న హైదరాబాద్‌లో సెక్రటేరియట్ ముట్టడి**

**కుమురం భీం జిల్లా నుంచి భారీగా తరలిరావాలని పిలుపు**

**ప్రజాజ్యోతి, ఆగస్టు 26 (ప్రజాజ్యోతి):**ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ విధానం తమకు అన్యాయం చేసేలా ఉందని ఆరోపిస్తూ మాల మహానాడు మరోసారి ఉద్యమ బాట పట్టింది. రోస్టర్ విధానాన్ని సమీక్షించి మాలలకు న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31న హైదరాబాద్‌లో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ప్రకటించారు. కార్యక్రమానికి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో మాల కులస్తులు తరలిరావాలని జిల్లా కమిటీ పిలుపుని చ్చింది. రోస్టర్ విధానంలోని 22వ పాయింట్ కేటాయింపుపై మాల సమాజంలో చాలాకాలంగా అసంతృప్తి వ్యక్తమవుతోందని జిల్లా నాయకులు తెలిపారు. ఉద్యోగ నియామకాల్లో మాల యువతకు తగిన అవకాశాలు దక్కేలా రోస్టర్‌ను పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్ల వేళ ఆందోళన ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేలాది మంది యువత పోటీ పడుతున్న సమయంలో రోస్టర్ విధానంలో తమకు న్యాయమైన వాటా లభించకపోతే మాల యువత ఉద్యోగ అవకాశాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై గతంలో పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదని తెలిపారు.మాల యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రోస్టర్ విధానాన్ని పూర్తిస్థాయిలో సమీక్షించాలని, 20లోపు రెండు పాయింట్లు కేటాయించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి బలంగా తీసుకెళ్లేందుకే సెక్రటేరియట్ ముట్టడి చేపడుతున్నట్లు స్పష్టం చేశారు.

### జిల్లా నుంచి భారీ సమీకరణకు పిలుపు

ఆగస్టు 31న నిర్వహించనున్న కార్యక్రమానికి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మాల కులస్తులు, యువత, ఉద్యోగార్థులు, మేధావులు అధిక సంఖ్యలో తరలిరావాలని జిల్లా కమిటీ కోరింది. హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని నాయకులు అన్నారు.మాల యువత భవిష్యత్తు, ఉద్యోగాల్లో న్యాయమైన వాటా కోసం పోరాటం కొనసాగుతుంది. రోస్టర్ సవరణ జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తాం" అని నాయకులు తెలిపారు.



### జిల్లా కమిటీ నాయకుల పిలుపు

జిల్లా కమిటీ సలహాదారులు ముల్కల శుభాష్ (రిటైర్డ్ ఎమ్మార్వో), బాబండ్లపెల్లి నరసయ్య, రెడ్డి గోపి, జిల్లా అధ్యక్షులు పరుస వెంకటేష్, ప్రధాన కార్యదర్శి తౌటి తిరుపతి, ఉపాధ్యక్షులు ఎడ్ల శ్రీనివాస్, మల్లెపల్లి రాజనర్సయ్య, సంయుక్త కార్యదర్శి కడారి శ్రీనివాస్, ముత్తునూరి ప్రకాష్, రామిల్ల పురుషోత్తం, ఓడేటి తిరుపతి తదితరులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సెక్రటేరియట్ ముట్టడి ద్వారా ప్రభుత్వం దృష్టిని ఆకర్షించి రోస్టర్ అంశంపై స్పష్టమైన నిర్ణయం తీసుకునేలా ఒత్తిడి తీసుకురావాలని జిల్లా కమిటీ నిర్ణయించినట్లు నాయకులు తెలిపారు.

# మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ముస్లిం సోదరులకు పండ్లు, వాటర్ పంపిణీ



మంచిర్యాల, 26, ఆగస్టు (ప్రజా జ్యోతి): అత్యంత పవిత్రమైన మహ్మద్ ప్రవక్త జన్మదినోత్సవం మిలాద్-ఉన్-నబీ సందర్భంగా మంచిర్యాల పట్టణంలో ముస్లిం సోదరులు నిర్వహించిన ర్యాలీకి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. బెల్లంపల్లి చౌరస్తా వద్ద మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు పండ్లు, వాటర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు, కార్పొరేటర్ ఖలీద్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పూదరి తిరుపతి, మంచిర్యాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సల్ల మహేష్, పీసీసీ సభ్యులు, నస్పూర్ పట్టణ ఇన్‌చార్జి నూకల రమేష్, అబ్దుల్ జలీల్, మినహాజ్ హుస్సేన్, మహమ్మద్ గౌసుద్దీన్, మక్బూల్ హుస్సేన్, మాజీ కౌన్సిలర్ మినహాజ్, పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు, మైనారిటీ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముస్లిం సోదరులకు మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలిపారు. సోదరభావం, ఐక్యత, శాంతి, సామరస్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

# బోర్దలో ఘనంగా 'ఇందిరమ్మ ఇల్లు' ప్రారంభం

**పేదల సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం: మంగాజీ**

**రేణుక--సంతోష్ దంపతులకు శుభాకాంక్షల వెల్లువ**



ఆసిఫాబాద్ ఆగస్టు 26 ప్రజా జ్యోతి కొమురంభీం ఆసిఫాబాద్ వాంకిడి మండల పరిధిలోని బోర్ద గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించుకున్న 'ఇందిరమ్మ ఇల్లు' గృహప్రవేశ మహోత్సవం పండుగవాతావరణంలో అత్యంత వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన మొహార్లే రేణుక సంతోష్ దంపతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు పూర్తి కావడంతో, కుటుంబ సభ్యులు మరియు గ్రామస్థుల సమక్షంలో సాంప్రదాయ బద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి గృహప్రవేశం చేశారు. ఈ వేడుకకు వాంకిడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గురునులే మంగాజీ ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేయడం ద్వారా నూతన గృహాన్ని అధికారికంగా ప్రారంభించారు.

**పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మహోపకారం:**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గురునులే మంగాజీ మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. నిరుపేదల ఆత్మగౌరవాన్ని పెంచేలా ప్రభుత్వం పక్కా గృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సాయం అందించేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్క పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనేది ప్రభుత్వ సంకల్పమని, బోర్ద గ్రామంలో రేణుక-సంతోష్ దంపతులకు సొంతిల్లు నెరవేరడం సంతోషదాయకమని ఆయన ఆకాంక్షించారు.

**అభినందించిన ప్రజాప్రతినిధులు, నాయకులు**

సొంతింట్లోకి అడుగుపెట్టిన రేణుక--సంతోష్ దంపతులకు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు మరియు గ్రామ ప్రముఖులు పూలమాలలు వేసి, దుశ్శాలువాలతో సత్కరించి నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాంబార గ్రామ సర్పంచ్ బెండరే కృష్ణ, నాయకులు వాడై పండు, వాడై ఉమేష్, నికురే సంతోష్, మోహుర్లే తిరుపతి, గురునులే ఆనంద్ రావు, బెండారే మోతిరామ్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బహుజనుల బతుకులు మారాలంటే బీఎస్పీతోనే సాధ్యం

**కోటపల్లి సమావేశంలో వరంగల్ జోన్-2 ఇన్‌చార్జి వరికిల్ల మల్లేష్**



మంచిర్యాల, 26, ఆగస్టు (ప్రజాజ్యోతి): బహుజనుల బతుకుల్లో సమూల మార్పు రావాలంటే బహుజన్ సమాజ్ పార్టీతోనే సాధ్యమని వరంగల్ జోన్-2 ఇన్‌చార్జి వరికిల్ల మల్లేష్ అన్నారు. చెన్నూరు నియోజకవర్గంలోని కోటపల్లి మండల కేంద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన వరికిల్ల మల్లేష్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఓటును అమ్ముకోవద్దని, ఓటును నమ్ముకోవాలని ఆయన పిలుపునిచ్చారు. బహుజన్ సమాజ్ పార్టీ ఏనుగు గుర్తుకు ఓటు వేసి ఆత్మగౌరవంతో జీవించాలని ప్రజలను కోరారు. కార్యకర్తలు గ్రామాల్లో పర్యటిస్తూ మహనీయుల సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలని, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని సూచించారు. పార్టీ నిర్మాణంలో భాగంగా సెక్టార్ కమిటీలు, బూత్ కమిటీలను ఏర్పాటు చేసి సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పార్లమెంట్ ఇన్‌చార్జిలు కాదాసి రవీందర్, బాలకళ్యాణ్ పంజా, ప్రత్యేక అతిథి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్, జిల్లా ఈసీ మెంబర్ శెట్టి ప్రవళిక, చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నూరి రాజు, నియోజకవర్గ అధ్యక్షులు గాజుల శంకర్, ఉపాధ్యక్షులు ఎండీ మతిన్ ఖాన్, నాయకులు సుందిళ్ల అశోక్, శెట్టి శంకరయ్యతో పాటు కోటపల్లి గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు.



ఖానాపూర్ ఆగస్టు 26 (ప్రజా జ్యోతి)గౌస్ ఏ ఆజాం మీలాద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మల్ పట్టణంలో బుధవారం మొహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గదర్శకాలు పాటిస్తూ సమాజ సేవలో యువకులు తమ పాత్ర పోషించాలని పేర్కొన్నారు. అనంతరం మహమ్మద్ ప్రవక్తను స్మరించుకుంటూ ఆయన నిజ జీవితంలో పాటించిన సూత్రాలు ఆచరణాలపై శ్లోకాలు, గీతాలు ఆలపిస్తూ ర్యాలీ నిర్వహించారు. తదుపరి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మౌలాన అన్వర్ పాషా ఖాద్రి, కౌన్సిలర్ షేక్ ఫెరోజ్, మాజీ కౌన్సిలర్ అన్వర్ భాయ్, గౌస్ ఏ ఆజాం మీలాద్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ అశ్రార్ ఖాద్రి, ఉపాధ్యక్షులు మొహమ్మద్ లతీఫ్, ప్రధాన కార్యదర్శి ఇసాక్ అలీ ఖాద్రి, సహాయ కార్యదర్శి షేక్ రహ్మత్ కోశాధికారి ఇర్ఫాన్ ఉద్దీన్ జావీద్ మిస్బ రజా ఆజాం గౌస్, ముషర్రాఫ్ అవైస్, అయాన్, అక్బర్ సల్మాన్ మిన్హాజ్.సలీం, శారీక్, ఇంతియాజ్, ముజ్జబ, ముబాషీర్ అమీన్ బాబా తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ఓటర్లందరినీ గుర్తించాలి

**-- ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు సుగుణక్క పిలుపు**



ఆసిఫాబాద్ ఆగస్టు 26 ప్రజా జ్యోతి నేడు (గురువారం) నిర్వహించనున్న గ్రామ సభల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా గుర్తించి, వారి ఓటు హక్కు పరిరక్షణకు కృషి చేయాలని కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క సూచించారు. ఈ మేరకు బుధవారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్ఐఆర్ ఫేజ్--2 ప్రక్రియలో భాగంగా చేపడుతున్న గ్రామ సభల్లో ఓటర్ల జాబితాను ప్రజలు పరిశీలించుకునేలా అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అర్హుల పేర్లు జాబితాలో లేకపోతే తగిన పత్రాలతో కొత్తగా నమోదు చేయించడంతో పాటు, మార్పులు చేర్పులు, అభ్యంతరాల స్వీకరణలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు సహకరించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, బీఎల్ఏ--2లు, సూపర్‌వైజర్లు, మండల, టౌన్, వార్డు అధ్యక్షులు సమన్వయంతో బాధ్యతాయుతంగా వ్యవహరించి ఏ ఒక్కరి ఓటు హక్కు మిస్ కాకుండా చూడాలని పిలుపునిచ్చారు.

## గల్ఫ్ లో మరణించిన షేక్ ఘౌస్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్



**ఖానాపూర్ ఆగస్టు 26( ప్రజా జ్యోతి)**ఖానాపూర్ మండలం సుర్జాపూర్ గ్రామానికి చెందిన షేక్ ఘౌస్ కుటుంబం పోషణకోసం సౌదీలో జీవనం సాగిస్తూ, అక్కడే పనిచేస్తుండగా ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు.ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ మృతుని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారికి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే బొజ్జు బొజ్జు పటేల్ భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంటా ఖానాపూర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగిలి శంకర్ మేడమ్ పల్లి సర్పంచ్ రాజు నాయక్ మాజీ మున్సిపల్ చైర్మన్లు రాజుర సత్యం అంకం రాజేందర్ దొనికేని దయానంద్ నిమ్మల రమేష్ తదితరులు పాల్గొన్నారు

## శ్రీరాంపూర్‌లో ఘనంగా దుర్గాదేవి ఆలయ ప్రాణ ప్రతిష్ఠ

**పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర కనీస వేతన కమిటీ చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ దంపతులు**



**మంచిర్యాల, 26, ఆగస్టు (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ కార్యాలయం, ఎస్అండ్‌పీసీ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ దుర్గాదేవి దేవాలయంలో ప్రాణ ప్రతిష్ఠ పవిత్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కనీస వేతన కమిటీ చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, ఆయన సతీమణి బినాదేవి దంపతులు హాజరయ్యారు. వారికి టెంపుల్ కమిటీ, ఐఎన్‌టీయూసీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పలువురు ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్‌రావు, సెంట్రల్ నాయకులు పేరం రమేష్, రవీందర్‌రెడ్డి, ల్యాగల శ్రీనివాస్, గరిగే స్వామి, ఏరియా నాయకులు వెంకటేశ్వర్లు, జీవన్‌రావు, మద్దెల వెంకటేష్, రామకృష్ణ, ఆర్‌కే-5 పిట్ సెక్రటరీ నంబయ్య, సంజీవరావు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి నాయకులు, కార్మికులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# సీపీఆర్ఎంఎస్ ట్రస్ట్ బోర్డు సమావేశం వెంటనే నిర్వహించాలి

**సీపీఆర్ఎంఎస్ (నాన్-ఎగ్జిక్యూటివ్)లో రిటైర్డ్ ఉద్యోగుల వైద్య సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి**




**మంచిర్యాల, 26, ఆగస్టు (ప్రజా జ్యోతి):** సింగరేణి కాలరీస్‌లో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగుల కోసం అమలు చేస్తున్న సీపీఆర్ఎంఎస్ (నాన్-ఎగ్జిక్యూటివ్) పథకానికి సంబంధించిన ట్రస్ట్ బోర్డు సమావేశాన్ని వెంటనే నిర్వహించి, రిటైర్డ్ ఉద్యోగుల వైద్య సమస్యలను పరిష్కరించాలని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ట్రస్ట్ బోర్డు సమావేశాలు క్రమం తప్పకుండా జరగకపోవడంతో వైద్య సమస్యలు, పథకంలో అవసరమైన మార్పులు, పెరుగుతున్న వైద్య ఖర్చులు వంటి అంశాలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు.ప్రస్తుతం ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య చికిత్స ఖర్చులు భారీగా పెరిగాయని, ముఖ్యంగా గుండె జబ్బులు, క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు, శస్త్రచికిత్సలు వంటి తీవ్రమైన అనారోగ్యాలకు లక్షల రూపాయలు ఖర్చవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో సీపీఆర్ఎంఎస్ పథకంలోని వైద్య పరిమితులను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు.రిటైర్డ్ ఉద్యోగుల ప్రధాన డిమాండ్లలో ప్రస్తుతం ఉన్న రూ.8 లక్షల వైద్య పరిమితిని తొలగించడం లేదా గణనీయంగా పెంచడం, క్రిటికల్ వ్యాధులకు అదనపు వైద్య రక్షణ కల్పించడం, ఔట్ పేషంట్ వైద్య సౌకర్యాలను మెరుగుపరచడం, వైద్య క్లెయిమ్‌లను వేగంగా పరిష్కరించడం ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డు పరిమితిని రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ని కోరారు.అదేవిధంగా సీపీఆర్ఎంఎస్ ట్రస్ట్‌లోని నిధులు, వాటి ఆదాయ-వ్యయాలు, పెట్టుబడులు, వైద్య క్లెయిమ్‌ల చెల్లింపుల విషయంలో రిటైర్డ్ ఉద్యోగులకు పూర్తి పారదర్శకత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది జనవరి, జూన్ నెలల్లో సీపీఆర్ఎంఎస్ కార్డు హోల్డర్లకు కార్డులో ఉన్న బ్యాలెన్స్ వివరాలను తెలియజేసినప్పటికీ, కొంతమందికి పూర్తి వివరాలు అందడం లేదని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లినప్పుడు కార్డులో తగినంత బ్యాలెన్స్ లేదంటూ సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు.వయోవృద్ధులైన విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు కార్డులోని బ్యాలెన్స్ తదితర వివరాలపై అయోమయానికి గురికాకుండా సీపీఆర్ఎంఎస్ ట్రస్ట్ బోర్డు సమావేశాలను ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘాల నాయకులు కోరారు. సింగరేణి యాజమాన్యం ప్రతి నెలా ఆడిట్ నిర్వహించి, ప్రతి ఉద్యోగి మెడికల్ కార్డులో ఉన్న బ్యాలెన్స్‌ను స్పష్టంగా తెలియజేసే విధంగా పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.సింగరేణి సంస్థకు జీవితాంతం సేవలందించిన రిటైర్డ్ ఉద్యోగులు వృద్ధాప్యంలో వైద్య భద్రత కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండకూడదని వారు స్పష్టం చేశారు. వెంటనే సీపీఆర్ఎంఎస్ ట్రస్ట్ బోర్డు సమావేశాన్ని ఏర్పాటు చేసి, ట్రస్ట్ బోర్డు సభ్యులతో చర్చించి రిటైర్డ్ ఉద్యోగుల వైద్య సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా గౌరవాధ్యక్షులు రాళ్లబండి రాజన్న డిమాండ్ లు చేశారు.

# జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఎస్పీ డా. జి. జానకి షర్మిల





**ఖానాపూర్ ఆగస్టు 26( ప్రజా జ్యోతి)** నిర్మల్ జిల్లా వ్యాప్తంగా భైంసా, నిర్మల్, ముధోల్,ఖానాపూర్, తానూర్ పట్టణాలతో పాటు వివిధ ప్రాంతాల్లో మిలాద్-ఉన్-నబీ వేడుకలు ప్రశాంత వాతావరణంలో ఘనంగా ముగిశాయని ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిల అన్నారు పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా పోలీసు యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని అన్నారు మిలాద్-ఉన్-నబీ వేడుకల సందర్భంగా ప్రజల రాకపోకలు, ప్రార్థనా మందిరాలు, ప్రధాన కూడళ్లు, సున్నితమైన ప్రాంతాలు, ఊరేగింపు మార్గాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపట్టారు.వేడుకల సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు విధులు నిర్వహించారు. సీసీ కెమెరాలు, మొబైల్ పెట్రోలింగ్, రూట్ మొబైల్ బృందాల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.మత సామరస్యం, పరస్పర శాంతియుత వాతావరణాన్ని కాపాడుతూ మిలాద్-ఉన్-నబీ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రజలకు జిల్లా పోలీసు శాఖ కృతజ్ఞతలు తెలిపింది. పండుగ సందర్భంగా పోలీసులకు సహకరించిన మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, నిర్వాహకులు మరియు ప్రజలను పోలీసు అధికారులు అభినందించారు.నిర్మల్ జిల్లా ప్రజలు అన్ని పండుగలను శాంతియుతంగా, సోదరభావంతో నిర్వహిస్తూ జిల్లా ప్రశాంతతకు సహకరించారనిఅన్నారు

## గేట్ కీపర్లను నియమిశీచకుండ నిర్లక్ష్యం వాహిస్తున్న అధాని సిమెంట్ కంపెనీ యజమాన్యం



**కాసిపేట, ఆగస్టు 26,(ప్రజాజ్యోతి):**కాసిపేట మండలంలోని మామిడిగూడ,గోండుగూడ గ్రామాల ప్రజలు నిత్యం కాసిపేట మండలం, మందమర్రి మండలానికి వెల్లె ప్రధాన రాహదారి మధ్యలో రైల్వే గేట్ ఉంధి. కాని అక్కడ గేట్ కీపర్లను నియమిశీచ ✓క పోవడం వలన ప్రజలు తిర్వ బ బాయశీధోలన కు గురి అవుతున్నారు. పశువులు, మేకల మంధా వెల్లూ సమయం లో కోధి రోజుల క్రీతం పశువులు మంధా వెల్తుంటే త్రూటిలో ప్రమాదం తప్పిందని గ్రామస్థులు వాపోతున్నారు. నిత్యం వ్యవసాయా కూలీ పనులు చేసుకునే రైతులు కూడా చాలా ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని గ్రామస్థులు తేలిపారు. గోండుగూడ గ్రామం రైల్వే ట్రాక్‌కు అనుకోని ఉంది కావున ప్రజలకు ఇబ్బందీ కలుగుతుంధాని ఆ ఉరికి ఐరాన్ పెన్సింగ్ వేయాలాని గ్రామస్థులు కొరారు.అయితే గొండుగూడ గ్రామం రైల్వే లైన్‌ని అనుకోని ఉండ డశీ వలన ఎప్పుడూ ఎప్రమాదం జరుగుతుంది అనిగ్రామ ప్రజలు బయ బ్రాశీతులకు గురి అవుతున్నారు.తక్షనమే గేట్ కీపర్ లాను నియామిశీ చిషిఫ్ట్‌ల పరంగా పని చెయ్యిశీచగలరని మామిడిగూడ గొండుగూడ గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు ఒకవెల గేట్ కీపర్ లను నియమించక పోయినట్లైథే గ్రామ ప్రజలందరు దేవపూర్ అధాని సిమెంట్ కంపెనీని ముట్టడి చేసి అంధోలనలు చేస్తాము అని హెచారిశీచారు..ఈ కార్యక్రమంలో భూక్యా రాములు నాయక్, ఇస్లవత్.సారయ్య,బీమ్ పటేల్, చిత్రు పటేల్, గ్రామ యువకులు రాము ,లక్ష్మణ్ గ్రామ పెద్ద మనుషులు పాల్గొన్నారు

## జాం గ్రామంలో 'వృక్ష రక్షా బంధన్' కార్యక్రమం





**సారంగాపూర్, ఆగస్టు 26 (ప్రజా జ్యోతి):** ప్రకృతి పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు మండలంలోని జాం గ్రామంలో వినూత్నంగా 'వృక్ష రక్షా బంధన్' కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రకృతి మిత్రులు జనార్దన్ సహకారంతో కదంబ ఫలాలు, ఆకులు, తాటి ఆకు నారతో పర్యావరణ హితమైన ఫ్రెండ్లీ రాఖీలను విద్యార్థులతో తయారు చేయించారు. అనంతరం విద్యార్థులు మొక్కలకు రాఖీలు కట్టి వాటి సంరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రకృతిని, వృక్షాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందనే సందేశాన్ని అటవీ ఉప క్షేత్రాధికారి మొహమ్మద్ నజీర్ ఖాన్ విద్యార్థులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జనార్ధన్, ఖీదీూ సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు

## గ్రామ సభలకు కాంగ్రెస్ శ్రేణులు హాజరుకావాలి: గుర్నూలే మెంగజీ



**ఆసిఫాబాద్ ఆగస్టు 26 ప్రజా జ్యోతి** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా నేడు మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభలకు కాంగ్రెస్ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు తప్పనిసరిగా హాజరుకావాలని వాంకిడి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్నూలే మెంగజీ కోరారు.గ్రామ సభల్లో ప్రదర్శించే ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, మరణించిన వ్యక్తుల పేర్లు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లు, ఒకే వ్యక్తికి ఉన్న బహుళ ఓట్లను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సవరణలు చేపట్టేలా చూడాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో నమోదయ్యేలా, అనర్హుల పేర్లు తొలగిపోయేలా కృషి చేయాలన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు కీలకమని, జాబితా పారదర్శకంగా రూపొందేలా కాంగ్రెస్ శ్రేణులు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

## బీరవెల్లి గ్రామంలో ఘనంగా మీలాద్ ఉన్ నబి వేడుకలు



**సారంగాపూర్, ఆగస్టు 26,ప్రజా జ్యోతి** మండలంలోని బీరవెల్లి గ్రామంలో బుధవారం మొహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మీలాద్ ఉన్ నబి పండుగను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా హజరత్ సయ్యద్ మునీర్ ఉద్దీన్ కష్ఫీ మాట్లాడుతూ ప్రపంచ శాంతి దూత మొహమ్మద్ ప్రవక్త బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని పేర్కొన్నారు. మొహమ్మద్ ప్రవక్త సూచించిన ఆదర్శాలు, నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఉందన్నారు.అనంతరం ఖవ్వాలి కార్యక్రమాన్ని నిర్వహించి మొహమ్మద్ ప్రవక్తపై శ్లోకాలు, గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ సమీర్, సయ్యద్ తల్మీజ్, హజరత్ ముఖ్తార్ ఖాన్, శంశీర్, జబ్బార్, అహ్మద్ ఇంతియాజ్ అలీ, ఫరూక్, ఇసాక్ అలీ, షాహిద్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శబరిమాత ఆశ్రమ ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ



**నేరడిగొండ, ఆగస్టు 26 (ప్రజాజ్యోతి):** మండలంలోని కుమారి గ్రామంలో గల శ్రీ శబరిమాత ఆశ్రమానికి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టేందుకు బుధవారం భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న, ఉపసర్పంచ్ ఆడెపు రవి, పాక్స్ చైర్మన్ మందుల రమేష్ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ అభివృద్ధికి ప్రహరీ గోడ నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ భక్తులు డోకూరు భోజన్న, డి. భోజగౌడ్, బిక్క లక్ష్మన్న, చాకలి గంగన్న, జె. నర్సారెడ్డి, పిట్ల భోజన్న, బొమ్మడి వెంకట రమణ, దుర్గి మురళిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మిలాద్-ఉన్ నబీ వేడుకలు



**తాండూర్, ఆగస్టు 26: ప్రజాజ్యోతి** ఇస్లాం మత చివరి ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మిలాద్–ఉన్–నబీ వేడుకలను తాండూర్ మండలంలో ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తాండూర్ జామా మసీద్ వద్ద నుండి ఐబీ మసీద్ వరకు ప్రత్యేకంగా ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొని ప్రవక్త ముహమ్మద్ సాహెబ్ సందేశాలను స్మరించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మత పెద్దలు, యువకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.తాండూర్ సీఐ ఎన్ దేవయ్య ఆధ్వర్యంలో కన్నె పెల్లి ఎస్సై విక్రం, తాండూర్ ఏఎస్ఐ రాజమొగిలి, తాండూర్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు

## వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు

**కనర్‌గాంలో ఆంటి–లార్వా స్ప్రే ప్రారంభం**

**పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి ఉప సర్పంచ్ జీవన్**



**ఆసిఫాబాద్ ఆగస్టు 26 ప్రజా జ్యోతి** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కనర్‌గాం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా బుధవారం గ్రామంలోని పలు కాలనీలు, మురుగు కాలువలు, నివాస ప్రాంతాల్లో ఆంటి–లార్వా (బైలర్వ) స్ప్రే చేయించారు.

**వ్యాధుల ముప్పు అరికట్టడమే లక్ష్యం: ఉప సర్పంచ్ జీవన్**

ఈ సందర్భంగా ఉప సర్పంచ్ జీవన్ మాట్లాడుతూ.. వర్షాల వల్ల నీరు నిల్వ ఉండే చోట దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. ముందస్తు జాగ్రత్తగా దోమల లార్వాను ప్రారంభ దశలోనే అరికట్టేందుకు ఈ స్ప్రేయింగ్ చేపట్టినట్లు తెలిపారు.

**పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి**

గ్రామంలో నిలిచిన నీటిని తొలగించడంతో పాటు మురుగు నీరు పారేలా పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఎక్కడైనా నీరు నిలిచిపోతే గ్రామస్థులు వెంటనే పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని కోరారు.

**ఇళ్ల పరిసరాల్లో జాగ్రత్తలు తప్పనిసరి**

ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, బకెట్లు, డ్రమ్ముల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. మురుగు కాలువల్లో చెత్త వేయకుండా పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**అనారోగ్య లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి**

జ్వరం, తీవ్ర తలనొప్పి, ఒళ్లు నొప్పులు, నీరసం వంటి అనారోగ్య లక్షణాలు కనిపిస్తే స్వయం వైద్యం జోలికి పోకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ఉప సర్పంచ్ జీవన్ గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు.

# కీలక ఖనిజాల వైపు సింగరేణి పరుగులు

**నైనీ స్ఫూర్తితో.. దేవదుర్గపై ఫోకస్**

**అన్ని ఖనిజ వేలాల్లో పాల్గొనాలి: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**మంచిర్యాల, 26, ఆగస్టు (ప్రజాజ్యోతి):** బొగ్గు గనులకే పరిమితమైన సింగరేణి కార్యకలాపాలను కీలక, వ్యూహాత్మక ఖనిజాల రంగానికి విస్తరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. కర్ణాటకలోని దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ బ్లాక్‌లో అన్వేషణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. బుధవారం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో సింగరేణి నూతన ప్రాజెక్టులు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై సంస్థ ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.సమావేశంలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, తిరుమలరావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కర్ణాటకలో సింగరేణి దక్కించుకున్న దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ అన్వేషణ బ్లాక్‌పై ప్రత్యేకంగా చర్చించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా అధ్యయనం చేసేందుకు గురువారం సింగరేణి ఉన్నతాధికారులతో కలిసి దేవదుర్గ బ్లాక్‌ను సందర్శించనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు.

**దేవదుర్గపై ప్రత్యేక దృష్టి...**

దేవదుర్గ బ్లాక్‌లో ఇప్పటివరకు చేపట్టిన పనులు, భౌగోళిక పరిస్థితులు, ఖనిజ నిక్షేపాల అన్వేషణకు తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై ఉప ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్వేషణ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఖనిజ అన్వేషణకు అవసరమైన అనుమతులు, మౌలిక సదుపాయాలు, ఇతర అంశాల్లో కర్ణాటక ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం తీసుకుంటామని తెలిపారు. దేవదుర్గ ప్రాజెక్టును విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడం ద్వారా బొగ్గు నుంచి కీలక, వ్యూహాత్మక ఖనిజాల రంగంలోకి సింగరేణి విస్తరణకు బలమైన పునాది పడుతుందని అ




న్నారు.

**అన్ని ఖనిజ వేలాల్లో పాల్గొనాలి...**

దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ సింగరేణి తన కార్యకలాపాలను విస్తరించాలని భట్టి విక్రమార్క సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే బొగ్గు, కీలక ఖనిజాల వేలాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ సింగరేణికి అనుకూలమైన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఆదేశించారు. త్వరలో వనాడియం, టైటానియం వంటి కీలక ఖనిజ బ్లాక్‌లు వేలానికి వచ్చే అవకాశం ఉన్నందున వాటిని దక్కించుకునేందుకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలని సూచించారు. కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల మైనింగ్ వైపు కూడా సింగరేణి అడుగులు వేయాలని తెలిపారు .దక్షిణాఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చిలీ తదితర దేశాల్లోని ఖనిజ అవకాశాలను అధ్యయనం చేసేందుకు అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించినట్లు తెలిపారు. అంతర్జాతీయంగా అందుబాటులోకి వచ్చే అవకాశాలను పరిశీలించి సింగరేణికి ప్రయోజనకరమైన ప్రాజెక్టులపై ముందడుగు వేయాలని సూచించారు.

**బొగ్గు ఉత్పత్తిపైనా ప్రత్యేక దృష్టి...........**

కీలక ఖనిజాల రంగంలో విస్తరిస్తూనే సింగరేణి ప్రధాన



కార్యకలాపమైన బొగ్గు ఉత్పత్తిపైనా ప్రత్యేక దృష్టి కొనసాగించాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్, ఇంధన భద్రతకు మరింత ప్రాధాన్యం ఏర్పడిందని, ఈ విషయంలో సింగరేణి కీలక పాత్ర పోషించాలని అన్నారు.

**భవిష్యత్ తరాలకు బలమైన సంస్థగా సింగరేణి....**

తెలంగాణకు గుండెకాయలాంటి ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిని మరింత లాభదాయకంగా తీర్చిదిద్ది, భవిష్యత్ తరాలకు బలమైన సంస్థగా అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బొగ్గు ఉత్పత్తిలో సింగరేణికి ఉన్న సుదీర్ఘ అనుభవాన్ని వినియోగించుకుంటూనే కీలక, వ్యూహాత్మక ఖనిజాల రంగంలోనూ దేశంలో అగ్రగామి సంస్థగా తీర్చిదిద్దేందుకు పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# గేర్జంలో తెలంగాణ రక్షణ సేనలోకి చేరికలు





**మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బా పురావుకు ఘన స్వాగతం**

**కొమరం భీం విగ్రహానికి పూ లమాల వేసి నివాళి**

**ఇచ్చోడ, ఆగస్టు 26 (ప్రజా జ్యోతి )**ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని గేర్జం గ్రామంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమా నికి హాజరైన బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు పార్టీ నాయకులు, కార్య కర్తలు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామా నికి చేరుకున్న రాథోడ్ బాపు రావు ముందుగా ఆదివాసీ పోరాట యోధుడు కొమరం భీం విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన పార్టీ జాయినింగ్ కార్యక్ర మంలో గ్రామానికి చెందిన సుమారు 300 మంది గ్రా మస్తులు తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. వారికి రాథోడ్ బాపురావు, పార్టీ నాయకులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వా నించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, గిరిజనులు బడుగు బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. గేర్జమ్ గ్రామంలో జరిగిన భారీ చేరికలతో తెలంగాణ రక్షణ సేన పార్టీకి ని యోజకవర్గంలో మరింత బలం చేకూరిందని మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మండల కన్వీనర్ షేక్ బిలాల్, ఆశా వాహ జడ్పీటీసీ హరన్ మారుతీ పటేల్, ముఖ్య కార్యకర్త ఖలీమ్, మైనారిటీ చైర్మన్ ఫరిద్, ఎండి ఆషిప్,షేక్ మ హమ్మద్, షేక్ ముస్తఫా, ఇచ్చోడ ,నేరడిగోండ మండల కన్వీనర్ వసంత్ రావ్, నాయకులు, గేర్జమ్ గ్రామ పటేల్ కనక లచ్చుపటేల్, కొ ట్నాక్ మహదు, కొట్నాక్ లచ్చు, పెద్ది రవి, పెందుర్ ప్రభాకర్, కనక మాన్కు, కనక సుంగు, మాజీ సర్పంచ్ సి డామ్ తులసిరా, కొట్నాక్ శంకర్, కనక శ్రీనివాస్, కొ ట్నాక్ విశ్వనాథ్, కొట్నాక్ రమేష్, విజయ్, వసంత్, ఇస్రు గంగారాం, హనుమంతు, పెద్ది శేఖర్, పడిగెల రమేష్, పడిగేల అనిల్, కత్తూరి ధర్మాన, నాగోరావ్, కనక రాందాష్, ధరంపూరి కొమరం జంగుపటేల్, తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

# సింగరేణిలో బీసీ కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి

రామగుండం--2 ఏరియాలో బీసీ--ఓబీసీ కార్మికుల ఆత్మీయ సదస్సు

**మంచిర్యాల, 26, ఆగస్టు (ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థలో బీసీ, ఓబీసీ కార్మికులు, ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాలను పరిష్కరించి, రాజ్యాంగబద్ధమైన హక్కులను కల్పించాలని సింగరేణి కాలరీస్ బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. రామగుండం--2 ఏరియాలో బీసీ, ఓబీసీ కార్మికుల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ రమేష్ హాజరయ్యారు. రామగుండం--2 ఏరియా నాయకులు ఐలి శ్రీనివాస్, సాంబశివ రావు పాల్గొనగా, శ్రీరాంపూర్ ఏరియా నుంచి అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్, బ్రాంచ్ కార్యదర్శి బద్రి బుచ్చయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సింగరేణి సంస్థను తమ రక్తాన్ని చెమటగా మార్చి దేశానికి వెలుగులు పంచుతున్న బీసీ కార్మికుల హక్కులను పరిరక్షించడంతో పాటు వారికి జరుగుతున్న అన్యాయాలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. సింగరేణి అంటే కేవలం బొగ్గు గనులు మాత్రమే కాదని, లక్షలాది కార్మిక కుటుంబాల జీవనాధారమని పేర్కొన్నారు. సంస్థలో 56 శాతానికి పైగా శ్రమశక్తి వెనుకబడిన తరగతుల కార్మికులదేనని, దేశ ప్రగతికి వెన్నెముకగా నిలుస్తున్న బీసీ కార్మికులకు సంస్థలో దక్కాల్సిన గౌరవం, హక్కులు పూర్తిస్థాయిలో అందుతున్నాయా అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు, గనుల్లో పనిచేసే సమయంలో లభించాల్సిన రక్షణ, చట్టబద్ధమైన పదోన్నతులు బీసీ కార్మికుల హక్కులని తెలిపారు. సంస్థ ఎదుగుదలకు ప్రాణాలను సైతం పణంగా పెట్టి పనిచేయడం కార్మికుల బాధ్యత అయితే, ఆ శ్రమకు తగిన గుర్తింపు, న్యాయం పొందడం వారి హక్కు అని స్పష్టం చేశారు. సింగరేణిలో బీసీ కార్మికులకు పదోన్నతుల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఎన్నో ఏళ్లుగా గనుల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రమోషన్ల విషయంలో న్యాయం జరగడం లేదని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ కావడం లేదని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉన్న విధంగానే బీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక బీసీ సెల్, పూర్తిస్థాయి అధికారి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి లాభాల్లో కీలక పాత్ర పోషిస్తున్న బీసీ కార్మికుల పిల్లల విద్య, కుటుంబ ఆరోగ్యం, భద్రత కోసం ప్రత్యేక సంక్షేమ ప్యాకేజీలు కల్పించాలని కోరారు. ఈ అన్యాయాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సింగరేణి యాజమాన్యం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లను, మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని, కేంద్ర పరిధిలోని ఉద్యోగాల్లో బీసీలకు ఉన్న 27 శాతం రిజర్వేషన్లను, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని రిజర్వేషన్లను సింగరేణిలో అన్ని డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ నియామకాలు, పదోన్నతుల్లో తూచా తప్పకుండా అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన డీఓపీటీ సర్క్యులర్లను అమలు చేస్తూ బీసీ ఉద్యోగుల హక్కుల రక్షణకు బీసీ వెల్ఫేర్ అసోసియేషన్లకు తగిన గుర్తింపు, ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్పొరేట్ కార్యాలయంతో పాటు ప్రతి ఏరియాలో బీసీ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు




చేసి, రోస్టర్ విధానాన్ని పర్యవేక్షించేందుకు సీనియర్ అధికారితో కూడిన కమిటీని నియమించాలని కోరారు. సింగరేణిలో ఇప్పటివరకు జరిగిన నియామకాలు, పదోన్నతుల్లో బీసీల రోస్టర్ పాయింట్లను పారదర్శకంగా సంస్థ వెబ్‌సైట్‌లో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అప్పుడే బీసీ కార్మికులు, ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయం ఏమిటో స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి సింగరేణిలో బీసీ కార్మికుల కోసం సబ్‌ప్లాన్ తరహాలో నిధులు, హక్కులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హక్కులు అడుక్కుంటే వచ్చేవి కావని, పోరాడితేనే సాధించుకునేవని పేర్కొంటూ బీసీ, ఓబీసీ కార్మికులు, ఉద్యోగులంతా ఒకే తాటిపైకి వచ్చి తమ చట్టబద్ధమైన హక్కుల సాధన కోసం శాంతియుతంగా, ఐక్యంగా, బలంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బీసీల ఐక్యత వర్ధిల్లాలని, కార్మిక ఐక్యత వర్ధిల్లాలని, సింగరేణి బీసీ--ఓబీసీ కార్మికులు, ఉద్యోగుల హక్కుల సాధన వైపు అందరూ కలిసి అడుగులు వేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# శ్రీరాంపూర్‌లో తలసేమియా వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గ సమావేశం

లూకోసైట్ ఫిల్టర్ల సరఫరా పునరుద్ధరణకు పోరాటం..

రూ.3 కోట్ల ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయాలని డిమాండ్

**మంచిర్యాల, 26, ఆగస్టు (ప్రజాజ్యోతి):** సికిల్ సెల్ బాధితులు ఎదుర్కొంటున్న వైద్య, సాంకేతిక సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని తలసేమియా వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గం నిర్ణయించింది. శ్రీరాంపూర్ సీసీ కార్యాలయంలోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు చుంచు శంకర్ వర్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో తలసేమియా, సికిల్ సెల్ బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి పలు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. మంచిర్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌లోని తలసేమియా, సికిల్ సెల్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ సెంటర్‌లో గత 7--8 నెలలుగా లూకోసైట్ ఫిల్టర్లు అందుబాటులో లేకపోవడంపై సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫిల్టర్ల సరఫరాను వెంటనే పునరుద్ధరించే వరకు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి, బాధితులకు న్యాయం జరిగేలా నిరంతరం పోరాటం చేయాలని తీర్మానించారు. అలాగే తలసేమియా, సికిల్ సెల్ బాధిత పిల్లలకు రక్తం కొరత లేకుండా క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, పోలీస్, రెవెన్యూ శాఖాధికారులు, స్వచ్ఛంద సంస్థలను కలిసి వినతిపత్రాలు సమర్పించాలని, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో బ్లడ్ బ్యాంకులో రక్త నిల్వలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. ఇటీవల బాధితులు, వారి తల్లిదండ్రులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో ఎదు



ర్కొంటున్న వైద్య, సాంకేతిక సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపేలా ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు. ప్రతి తలసేమియా, సికిల్ సెల్ బాధిత చిన్నారి తల్లిదండ్రులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు. సభ్యత్వాలను విస్తృతంగా పెంచుకుని భవిష్యత్‌లో రెడ్ క్రాస్ నిర్వహణలో కీలక బాధ్యతలు చేపట్టి బాధితులకు మరింత మెరుగైన సేవలు అందించాలని తీర్మానించారు. రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లోని తలసేమియా ట్రాన్స్‌ఫ్యూజన్ సెంటర్ ఇంచార్జులుగా వ్యవహరిస్తున్న కాసర్ల శ్రీనివాస్, చుంచు శంకర్ వర్మలకు అప్పగించిన బాధ్యతలను స్వతంత్రంగా నిర్వర్తించేలా పూర్తి అధికారాలు కల్పించాలని కోరారు. ఇంచార్జ్‌ల విధుల్లో ఇతరుల అనవసర జోక్యాన్ని నివారించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి రావాల్సిన సుమారు రూ.3 కోట్ల ఆరోగ్యశ్రీ నిధులను తక్షణమే విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. నిధుల విడుదల కోసం సంబంధిత అధికారులకు తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేసి, నిధుల సాధనకు కృషి చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సొసైటీ నాయకులు ఎస్. అశోక్ కుమార్, దుర్గం శ్రీనివాస్, దుర్గం వెంకటేష్, బొజ్జ వెంకటయ్య, కర్రు శ్రీనివాస్, కృష్ణ స్వామి, రత్నం తిరుపతి, బండ అవినాష్, ఏ. కమల, పి. సుమలత తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బొజ్జుపటేల్ను సన్మానించిన ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు



**ఖానాపూర్ ఆగస్టు 26 (ప్రజాజ్యోతి )** ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ స్వర్ణ రెడ్డి సీనియర్ డాక్టర్ వంశీ మాధవ్లు నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు వెడమ బొజ్జు పటేల్ సన్మానించారు బుధవారం ఖానాపూర్ పర్యటన నిమిత్తం క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా నూతనంగా ఆసుపత్రిలో సూపర్డెంట్ గా బాధ్యతలు స్వీకరించిన స్వర్ణ రెడ్డితోపాటు మరో డాక్టర్ మర్యాదపూర్వకంగా కలిసి ఆస్పత్రిపరిస్థితులను ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వివరించారు సీనియర్ డాక్టర్ స్వర్ణ రెడ్డి సూపర్డెంట్ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఆసుపత్రుల్లో రోగులకు మరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ డాక్టర్లకు సూచించారు

## విద్యార్థి నేస్తం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్గా బద్దం పురుషోత్తం రెడ్డి



**బోథ్. ఆగస్టు 26. (ప్రజా జ్యోతి)** యువతకు సాధికారత అనే లక్ష్యంతో పని చేస్తున్న విద్యార్థి నేస్తం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్గా బోథ్ మండలంలోని ధన్నూర్ గ్రామానికి చెందిన బద్దం పురుషోత్తం రెడ్డిని, ఆదిలాబాద్ జిల్లా కో- కన్వీనర్ గా బోథ్ మండలంలోని కౌట బి గ్రామానికి చెందిన గౌడిసెల రమణ గౌడ్ లను నియమిస్తూ విద్యార్థి నేస్తం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్. పీ మురళి మనోహర్ ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా బద్దం పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి నేస్తం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అనేది భారత ప్రభుత్వం గుర్తింపు పొందిన చారిటబుల్ ట్రస్ట్ అని, వికసిత్ భారత్ కోసం యువతకు సాధికారత అనే లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. వికసిత్ భారత్ 2047 నిర్మాణంలో భాగస్వాములై యువతను సాధికారత వైపు నడిపించడమే ఈ సంస్థ ప్రధాన ఉద్దేశమని ఆయన అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సంస్థ బలోపేతంతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో విద్యా, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ వికాసం పై కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో త్వరలో హైదారాబాద్ లో జరగనున్న జాతీయ సమావేశాలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. తమపై నమ్మకంతో ఈ గురుతర బాధ్యతలు అప్పగించిన సంస్థ అడ్వైసర్, కన్వీనర్ డాక్టర్ పి. మురళి మనోహర్, వ్యవస్థాపకులు డాక్టర్ విశ్వనాథ్, ప్రొఫెసర్ గణేష్, రాజేష్ యాదవ్ లకు కృతజ్ఞతలు తెలియజేసారు.

## ఆడేగామ ( కే ) వాసికి అరుదైన గౌరవం



**బజార్హత్నూర్, ఆగస్టు 26 ( ప్రజాజ్యోతి ):**నాడు సౌతాఫ్రికా యూనివర్సిటీ నేడు అమెరికా యూనివర్సిటీ. గౌరవ డాక్టరేట్ డిగ్రీలతో న్యాయవాది సుధీర్ కుమార్ సంగెం కు ఘనసత్కారం. సంవత్సరాల సామాజసేవకు సముచిత స్థానం. సంగెం చారిట బుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవకు డే స్ప్రింగ్ యూనివర్సిటీ అమెరికా ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ డిగ్రీ తో విశాఖపట్నం లో సత్కారం ఈ నెల 25 న విశాఖపట్నంలో యూనివర్సిటీ అధ్యక్షులు డాక్టర్ శ్రీ పౌల్ శామ్యూల్,యూనివర్సిటీ చాన్సిలర్ శ్రీ అమెల్ జేమ్స్,డాక్టర్ కెనిత్ హెండ్రి, చేయుత ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ చెన్న రావు, బిషప్ డాక్టర్ రోడ్రిక్స్ తదితరులు పాల్గొన్నారు. మారు మూల ఆదిలాబాద్ జిల్లా నుండి అమెరికా యూనివర్సిటీ నుండి డాక్టర్ డిగ్రీ పొందడం పట్ల జిల్లా ప్రజలు హర్షం వ్యక్తపరుస్తున్నారు, గౌరవ డాక్టర్ డిగ్రీతో అమెరికా యూనివర్సిటీ సన్మానం చెయ్యడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు న్యాయవాది డాక్టర్ సుధీర్ కుమార్ సంగెం అన్నారు. అగ్ర దేశం డాక్టర్ డిగ్రీ తో సన్మానం చెయ్యడం పట్ల గ్రామ ప్రజలు, తోటి న్యాయవాదులు, సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాకు దక్కిన గౌరవంగా భావి స్తున్నారు. డాక్టర్ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందని న్యాయ వాది డాక్టర్ సంగెం సుధీర్ కుమార్ తెలిపారు.

## బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ సారంగాపూర్ మండల కమిటీ ఎన్నిక



**సారంగాపూర్, ఆగస్టు 26,ప్రజా జ్యోతి** మండల కేంద్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ సారంగాపూర్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల అధ్యక్షుడిగా బొడిగెల రాహుల్ ఎన్నిక కాగా, ఉపాధ్యక్షులుగా అల్లాడి నరసయ్య, దోకూర్ భీమలింగం, జాదవ్ సుధర్ సింగ్, జంగం సాయన్న ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా రాథోడ్ సంతోష్ బాధ్యతలు చేపట్టారు. కార్యదర్శు లుగా గాదె గోవర్ధన్, ముద్రం దినేష్, కండెల అంజయ్య, చాట్ల శ్రీధర్ ఎన్నికయ్యారు. సోషల్ మీడియా ఇన్చార్జిగా కుందూరు వినోద్ నియమించారు. గౌరవ సలహాదారులుగా కండెల రాము, పిల్లి సంతోష్, మేకల సింహం, సర్పంచ్ కునేరు భూమన్న, సర్పంచ్ ఆడే అంబాజీలను ఎన్నుకున్నారు.తెలంగాణ ఉద్యమకా రుడు సామల వీరయ్యను జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పలువురు శు భాకాంక్షలు తెలిపారు.

## కారు, స్కూటీ ఢీ: ఇద్దరు మహిళలకు గాయాలు



**సారంగాపూర్, ఆగస్టు 26 (ప్రజా జ్యోతి):** సాయినగర్ గ్రామ రోడ్డు మార్గంలో మారుతి వ్యాగన్ఆర్ కారు స్కూటీని ఢీకొన్న ఘటనలో స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలు గాయపడ్డా రు. గాయపడిన వారిలో నలిమెల వినోద, గంగ వనిత ఉన్నారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం వారిని 108 అంబులెన్స్లో నిర్మల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.గాయపడిన మహిళలను సకాలంలో ఆసుపత్రికి తరలించడంలో 108 ఈఎంటీ ప్రభాకర్, పైలెట్ మహేష్ సేవలు అందించారు.

## ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ భూ బాధిత రైతులకు జోగు రామన్న భరోసా

**జిల్లా కలెక్టర్ తో సమావేశం అయి అనుమానం నివృత్తి**



**ఆదిలాబాద్ బ్యూరో, ఆగస్టు 26, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి సంబంధించి చుట్టుపక్కల గ్రామాల రైతు లు, గ్రామస్తుల్లో నెలకొన్న అనుమానాలు, ఆందోళన ల పై స్పష్టత కల్పించేందుకు మాజీ మంత్రి జోగు రామన్న చొరవ తీసుకున్నా రు. గ్రామ స్తులు, రైతులు మాజీ మం త్రి జోగు రామన్నను కలిసి వారి సమస్యలను వివ రించగా, ఆయన జిల్లా కలె క్టర్ రాజర్షి షా తో క్యాంప్ కార్యాలయంలో సమావేశం అయి వారి సమస్యల పై చర్చించారు. ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి సంబం ధించి భూసేకరణ, భూముల ధరలు, గ్రామాల పై ప్రభావం తదితర అంశాలపై రైతులు, గ్రామస్తులు ఎదుర్కొంటున్న సందే హాలను జిల్లా కలెక్టర్ దృష్టికి జోగు రామన్న తీసు కెళ్లారు. పరిస్థితులపై పూర్తి సమాచా రాన్ని అందించి, రైతులు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. దీంతో గ్రామ స్తులు జోగు రామన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అ నంత ంరం జోగురామన్న మా ట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ బహిరంగంగా, సోషల్ మీడియా వేదికగా భూములకు తక్కువ ధర వస్తుందంటూ ప్రకటనలు చే యడంతో చుట్టుపక్కల గ్రా మాల రైతులు, ప్రజల్లో భయాందోళన, వాతావరణం ఏర్పడింద న్నారు. రైతులు, గ్రామస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ అధైర్య పడవద్ద ని సూచించా రు.భూముల ధరల విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లా కలెక్టర్ స మక్షంలో సంబం ధిత గ్రామాల ప్రజలు, రైతులతో సమీక్షలు నిర్వహించి, గ్రామ సభలు ఏర్పాటు చేయడంతో పాటు సామాజిక-ఆర్థిక సర్వేలు నిర్వహించిన అనంతరం భూసేకరణ, పరిహారం ధరల నిర్ణయ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. రైతులు, గ్రామస్తుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందుకు వెళ్లాలని కోరుతున్నా మని, ప్రజలకు ఎలాంటి అన్యా యం జరగకుండా తమవం తు కృషి చేస్తామని జోగు రామన్న భరోసా ఇచ్చారు. రైతులు, గ్రామ స్తులు ఎవరూ అధైర్య పడవద్దని, వారి వెంట బీఆర్ఎస్ పార్టీ ఎల్ల వేళలా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బండి దత్తాత్రేయ, కదరపు అశోక్, రావుల సోమన్న, రమేష్, ఇస్తారి, జీవన్, బండి సాగర్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## శీను బాబు సమక్షంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి జన్మదిన వేడుకలు.

**కమాన్ పూర్** కమాన్ పూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ జన్మదిన వేడుకలు పిసిసి ప్రధాన కార్యదర్శి శీను బాబు సమక్షంలో బుధవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని శ్రీ ఆదివారాహ స్వామి ప్రాంగణంలో సయ్యద్ ఇక్బాల్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శీను బాబు సమక్షంలో కేక్ కట్ చేసి కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్ సయ్యద్ అన్వర్, సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, అంబిలి శ్రీనివాస్, రెబల్ రాజ్ కుమార్, కిషన్ రెడ్డి, ఉప సర్పంచ్ సోహెల్, జెమినీ గౌడ్, మల్యాల మహేష్ గౌడ్, లల్లు తదితరులు పాల్గొని శు భాకాంక్షలు తెలియజేశారు.

## జి.యం. కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం

**కమాన్ పూర్** రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో ప్రాతినిధ్య సంఘం అయినటువంటి సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టియుసి) ప్రతినిధులతో బుధవారం జి.యం. కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో భాగంగా ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లతో ప్రాతినిధ్య సంఘం ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, ఇతర సభ్యులు చర్చించారు. ఈ సమావేశంలో సింగరేణి సంస్థలో అమలులో ఉన్న ఎల్ 1, ఎల్ 2, విధానం కారణంగా ఓ.బి, అండర్ గ్రౌండ్ సివిల్ పనులలో, పరికరాల పని ముట్లలో నాణ్యత లోపాలు కనిపిస్తున్నాయని, ప్రస్తుత ఎల్ 1, ఎల్ 2, పూర్తిగా పునః సమీక్షించి, నాణ్యతకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా అమలు చేయడం, సింగరేణి వ్యాప్తంగా ఒకరి క్వార్టర్ లో మరొకరు ఉంటున్నారని అన్ని క్వార్టర్లను క్రమబద్ధీకరించి ఎవరైతే క్వార్టర్లో ఉంటున్నారో వారికి పర్మనెంట్ చేయడం, ఐ ఈ డి లెక్కల ప్రకారం అడ్డులా లాంగ్వాల్ గనిలో అదనంగా ఉన్న ఎలక్ట్రీషన్, ఫిట్టర్ లను, ఘనంగా ఉన్న సిబ్బందిని అవసరానికి అనుగుణంగా ఓ సి పి 1, ఓసిపి-2 లకు బదిలీ చేయడం, సెంటినరీ కాలనీలో గల క్వార్టర్స్ నిర్మించి చాలా కాలం అవుతున్న కారణంగా తరచూ మరమ్మత్తులు అవుతున్నాయి కాబట్టి సివిల్ విభాగం కు తగినంత మాన్ పవర్ ను ఇచ్చి క్వార్టర్ల మరమ్మత్తులను సకాలంలో చేపట్టేలా చర్యలను తీసుకోవడం, ఓసిపి-1 ఎస్ అండ్ డి విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ద్విచక్ర వాహన పార్కింగ్ కోసం షెడ్లు ను నిర్మించడం, ఆర్ జి త్రీ, ఏపీఏ ఏరియాలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు అర్జీ -2 ఏరియా లోని ఉద్యోగులతో సమానంగా క్వార్టర్స్ కౌన్సిలింగ్ లో అవకాశం కల్పించడం, ఇష్టం లేని పదోన్నతి వద్దని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థనను పరిగణలోకి తీసుకొని పదోన్నతి రద్దుచేసి వారిని యధా ప్రకారం వారి డెసిగ్నేషన్ లలో కొనసాగించడం, ఓసిపి-1 ఉత్పత్తి, రోజువారి కార్యకలా పాలకు అవసరమైన స్థాయిలో డోజర్ లను అందుబాటులో ఉంచడం, వర్షపు నీరు నిలవడం వల్ల సిహెచ్పీ కాంట గేట్ ప్రాజెక్ట్ ఆఫీస్ గేటు వరకు గల రహదారి, కాంపౌండ్ ఫెన్సింగ్ వెంబడి ఉన్న సైడ్ డ్రెయిన్ క్లియర్ చేయడం, వర్షపు నీరు సక్రమంగా వెళ్లి పోయేలా చర్యలు తీసుకోవడం, సెంటినరీ కాలనీలో కోతులు, వీధి కుక్కలు, పందుల బెడద విపరీతంగా పెరిగిందని కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి నియంత్రణకు తక్షణ, శాశ్వత చర్యలు తీసుకోవడం, లాంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిఎంలు మాట్లాడుతూ ఏరియా పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా వివరాలను సేకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అదేవిధంగా కార్పోరేట్ కార్యాలయ పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.ఈ సమావేశంలో స్ట్రక్చరల్ కమిటీ సభ్యులు జి.తిరుపతి, కె.సాయికృష్ణ, ఎన్.శ్రీనివాస రావు, ఎస్పో టుజియం యం.రామ్మోహన్, ఏరియా ఇంజినీర్ ఎ.ఉదయ భాస్కర్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు కె.జనార్దన్, జి.శంకర్, ఐ ఇ డిజిఎం బి.టి.

## సమాజ శ్రేయస్సుకు తన వంతు కృషి చేయాలి



**లక్ష్మణ చాంద, ఆగస్టు 26 (ప్రజా జ్యోతి)** మండలంలోని కనకాపూర్ గ్రామంలో గల కెఎన్ ఆర్ ఫంక్షన్ హాల్లో బుధవారం రోజున బుద్దిస్ట్ వివాహం జరిగింది. ఈ సందర్భంగా బుద్ధుడు ప్రభోదించిన అష్టాంగ మార్గాన్ని దాని అర్థాన్ని సమాజ శ్రేయస్సు కు దాని అత్యవసరాన్ని బోదకులు వివరించారు. హింసకు దూ రంగా ఉండాలని నిస్వార్థంతో జీవించాలని సమాజ శ్రేయస్సుకు పాటు పడాలని ఉత్తేజ పరిచారు.నూతన జంట బుద్ధున్ని ఆద ర్శంగా తీసుకుని జీవించాలని పేర్కొన్నారు. అనంతరం నూతన వివాహం చేసుకున్న నవీన్ లాస్విక జంటను పువ్వులతో ఆశీర్వదించారు.వివాహ ధృవపత్రాన్ని కూడ అందజేశారు. ఈ కార్యక్రమంలో బుద్ధుని ప్రభోదకులు,బౌద్దిస్టులు పాల్గొన్నారు.

## టైక్వాండోలో గోల్డ్ మెడల్ సాధించిన దివ్యకు మాజీ మంత్రి అభినందనలు



**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 26, (ప్రజా జ్యోతి )** ఆదిలాబాద్ పట్టణానికి చెం దిన వర్ష, కిరణ్ దంపతుల కుమార్తె దివ్య టై క్వాండోలో గోల్డ్ మెడల్ సాధించడం పట్ల మాజీ మంత్రి జోగు రామ న్న హర్షం వ్యక్తం చేశారు. దివ్య నివాసానికి వెళ్లి జోగు రామన్న ఆమెను శాలువా తో ఘనంగా సత్కరించి, పు ష్పగుచ్ఛం అందించి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సం దర్భంగా జోగు రామన్న మా ట్లాడుతూ, చిన్న వయసు లోనే టైక్వాండోలో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించడం అభినంద నీయమన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయక త్వ లక్షణాలను పెంపొంది స్తా యని అన్నారు. దివ్య సా ధించిన విజయం ఆదిలా బాద్ పట్టణానికి, తల్లిదం డ్రులకు, కోచ్లకు గర్వకారణమని పేర్కొన్నారు.దివ్య ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయా లు సాధించి రాష్ట్ర, జా తీయ స్థాయిలో ఆదిలాబా ద్ కు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ప్రతిభ చూపు తున్న యువత, విద్యార్థులను ప్రో త్సహించేందుకు ప్రతి ఒక్క రూ ముందుకు రావాలని జోగు రామన్న పిలుపు నిచ్చారు. ఈ కార్య క్రమంలో మాజీ కౌన్సిలర్ రామేశ్వర్, నల్ల మహేందర్, సంజయ్, విట్టల్, ప్రకాష్, అంబదాస్, వికాస్, తదితరులు పాల్గొ న్నారు.

## ఐ ఎన్ టి యు సి మండల అధ్యక్షుడుగా జెల్ల సతీష్



**సిరికొండ, ఆగస్టు 26, (ప్రజా జ్యోతి )** సిరికొండ మండల అధ్య క్షునిగా జెల్ల సతీష్ నియమితు లయ్యారు. సిరికొండ మండల అధ్యక్షులుగా నియామకం అయినా జెల్ల సతీష్కు జిల్లా ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు మునిగేలా నర్సింగ్ ఆధ్వర్యంలో బుద వారం జిల్లా డీసీసీ ఆఫీస్లో అధ్యక్షులుగా నియామి స్తూ ఉత్తర్వు ల కాపీ అందజే శారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీ ఉప అధ్య క్షులు దీపక్ రావు, నర్సింహాచారి, సిరికొండ మండల అధ్యక్షు లు కంచం లక్ష్మన్, మైనారి టీ మండల చైర్మన్ ఎండీ రం జాన్, ఏ ఎం సి డైరెక్టర్ చా వాన్ ప్రకాష్, ఎండీ ముజిబ్, జీవన్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## దివంగత వరుణ్ రాజ్ కు ఘనంగా నివాళులర్పించిన రాజకీయ ప్రముఖులు




**ఆదిలాబాద్ టౌన్ ,ఆగష్టు 26, (ప్రజా జ్యోతి )** రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఉపా ధ్యక్షులు,యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షులు బాల శంకర్ కృష్ణ తన యుదు దివంగత వరుణ్ రాజ్ (20) ఇటీవల అనారోగ్యంతో అతిచిన్న వయసులోనే మృతి చెందాడు. ఆయన స్వగృహంలో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన (నె లమాసిక) పెద్ద కర్మకు ప్రముఖ రాజకీయ నాయకులు హాజరై ఘనంగా నివాళులు అర్పించారు. వరుణ్ రాజ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్ర మంలో ఆదిలాబాద్ శాసన సభ్యులు పాయల శంకర్, మాజీ మంత్రి జోగు రామన్న, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గం ఇం చార్జ్ కంది శ్రీనివాసరెడ్డి, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ దంపతు లు బండారి అనూష సతీష్, డిసిసిబి మాజీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకురాలు సుహాసినీ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దుర్గం శేఖర్, జిల్లా అధ్య క్షులు పరమే శ్వర, గిమ్మ సంతోష్, యూనిస్ అక్బానీ,సా జిద్ ఖాన్ తదితరులు వరు ణ్ రాజ్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివా ళు లర్పించి ఆయన కుటుంబ సబ్యులకు ప్రగాఢ సాను భూతి తెలి పారు. వరుణ్ రాజ్ మరణం వారి కుటుంబానికి తీరనిలోటని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కలిగించా లని, వరుణ్ రాజ్ ఆత్మకు శాంతి కలగాలని కో రుతూ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలోకుల సంఘాలు, యువజన సం ఘాలు, తెలంగాణ ఉద్య మకారులు,రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, ఆత్మీయులు, బంధువులు, స్నేహితులు, కాలనీవాసులు, అల్లూరి భూమన్న, నిమ్మల ప్రశాంత్, ప్రజ్ఞ కుమార్, సోగాల సుదర్శన్, రామచంద్ర మహాత్మా, ఊరే గణేష్, నక్క రామదాసు, షకీల్, నారాయణ యాదవ్, డాక్టర్ వీరాంజ నేయులు, నరేందర్, ఇజ్జగిరి నవీన్, సవిన్ రెడ్డి, తదితరులు పాల్గొని వరుణ్ రాజ్ కు ఘనంగా నివాళులర్పించారు.